
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 25 జనవరి 2024





- ఫలితం నాయకులకు.. పాపాలు అధికారులకు
- చెప్పిన పనిచేయకపోతే బదిలీలు, దాడులు, కేసులు
- ఐదు సంవత్సరాలుగా నలిగిపోతున్న అధికారులు

అధికారులే.. సమిధలు..

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నిక సందర్భంగా అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు విని వాళ్లకు తన లాగిన్‌ను ఇచ్చేసి 30 వేల బోగస్ ఓటరు కార్డులను తయారు చేయడానికి సహకరించాడనే ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషాను సస్పెండు చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై జిల్లా వ్యాప్తంగా పలు రకాలుగా వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు వినడమెందుకు? ఇప్పుడు ఇబ్బందులుపడడం ఎందుకు? అని పలువురు పేర్కొంటున్నారు. అయితే తమ స్వార్థం కోసం అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి.. చేయరాని పనులు చేయించిన అధికార పార్టీ నాయకుల గురించి ఎవరూ నోరు మెదపకపోవడం విశేషం. తిరుపతి ఎన్నికల్లో ఎవరు గెలిచినా..? ఎవరు ఓడినా..? అధికారులకు ఒరిగేదీ ఏమీ లేదు. అటువంటప్పుడు తామే చొరవ తీసుకుని బోగస్ ఓటు కార్డులు తయారు చేయించాల్సిన అవసరం అధికారులకు ఉండదు. అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘించి అడ్డమైన పనులు చేసుకునే అవసరం అధికార పార్టీ నాయకులకే ఉంటుంది. అధికారులపై అధికార పార్టీ నాయకులు తీవ్ర ఒత్తిళ్లు తెచ్చిన సంఘటనలు గత ఐదేళ్లలో జిల్లాలో ఎన్నో జరిగాయి. ఇలా అధికార పార్టీ నాయకుల మాటలు వినని ఎందరో రెవెన్యూ, పోలీసు, ఇంజనీరింగ్ అధికారులకు బదిలీల సత్కారాలు ఎదురయ్యాయి. ఇంకా కొందరు అధికారులు తప్పుడు కేసుల్లో చిక్కుకున్నారు. ఒకటి, రెండుచోట్ల అధికారులపై అధికార పార్టీ నాయకులు దాడులకు సైతం దిగారు. పలువురు సస్పెండు అయ్యారు. ఈ నేపథ్యంలో వైసీపీ పాలనలో అధికార పార్టీ నాయకులు చెప్పింది వినని అధికారులు పడ్డ ఇబ్బందులు కొన్ని..

- ఓబులవారిపల్లె తహసీల్దార్ వెంకటసుబ్బయ్య తాము చెప్పినట్లు విని సహకరించడం లేదని అధికార పార్టీ నాయకులు ఆయనను బదిలీ చేయించారు. ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ పీర్ మున్నీని ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా కొనసాగించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పుల్లారెడ్డిని తహసీల్దార్‌గా నియమించారు. సుమారు రెండు సంవత్సరాల పాటు.. ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌నే ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా కొనసాగించారు. తాము చెప్పినట్లు వినడంలేదని వెలుగు సీసీ రామచంద్రను ఓబులవారిపల్లె నుంచి చిట్వేలికి బదిలీ చేశారు.
- గుర్రంకొండ మండలంలో తమకు అనుకూలంగా పనిచేయడం లేదని ఎంపీడీవో గంగయ్యను వైసీపీ నాయకులు ముఖ్యప్రజాప్రతినిధులకు చెప్పి బదిలీ చేయించారు. గంగయ్యను కలికిరి మండలానికి అక్కడ ఉన్న వెంకటేశులను ఇక్కడికి మార్చారు. అదేవిధంగా ఏపీఎంగా పనిచేసిన రాజేశ్వరిని వైసీపీ నాయకులు బదిలీ చేయించారు. తాము చెప్పిన మహిళా సంఘాలకు ఇష్టానుసారంగా రుణాలు మంజూరు చేయలేదనే అక్కసుతో కొందరు అధికార పార్టీ నాయకులు ఆమెను రామసముద్రం మండలానికి బదిలీ చేయించారు.
- నిమ్మనపల్లె మండలంలో గతంలో ఏవోగా పనిచేసిన చంద్రశేఖర్‌ను బి.కొత్తకోటకు డిప్యూటేషన్‌పై బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న ఏవో మురళీమోహన్‌ను నిమ్మనపల్లికి మార్చారు. తాము చెప్పినంత మందిని వేరుశనగ కాయలు పంపిణీ కార్యక్రమానికి పోగు చేయలేదని, ముఖ్య ప్రజాప్రతినిధి ఆయనపై కక్ష పెంచుకుని ఉన్నతాధికారులకు చెప్పి డిప్యుటేషన్‌పై బదిలీ చేయించారు.
- కలకడ తహసీల్దార్‌గా 2022లో పనిచేసిన జె.రాము ఏడాది తిరక్కముందే పెద్దమండ్యం మండలానికి బదిలీ అయ్యారు. దీని వెనుక స్థానిక వైసీపీ నాయకుల హస్తం ఉందనే గుసగుసలు అప్పట్లో వినిపించాయి.
- మదనపల్లెలో స్థానిక ప్రజాప్రతినిధితో పొసగక చాలా మంది డివిజన్ స్థాయి అధికారులు తామే బదిలీ చేయించుకుని వెళ్లిపోయారు. మదనపల్లెలో ప్రజాప్రతినిధి వల్ల పలువురు ఉద్యోగులు అష్టకష్టాలు పడ్డారు. ఎందరో సస్పెండు అయ్యారు. మరెందరో బదిలీ అయ్యారు. మదనపల్లె టూటౌన్ పోలీసుస్టేషన్ సీఐలుగా పనిచేసిన సురేష్‌కుమార్, హనుమంతునాయక్, రాజేంద్రనాధ్‌యాదవ్, నరసింహులు, మురళీకృష్ణలు స్థానిక ప్రజాప్రజానిధి చెప్పిన మాట వినలేదని బదిలీ చేశారు. ప్రస్తుతం టూటౌన్ సీఐ పోస్టు ఖాళీగా ఉంది. వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఈదురుబాష, మహబూబ్‌బాషలు బదిలీపై వెళ్లారు. ఇక పలువురు ఎస్ఐల మాట సరేసరి.. మదనపల్లె ఎఫ్ఆర్‌వోగా పనిచేసిన ఈశ్వరయ్య స్థానిక ప్రజాప్రతినిధి మాట వినలేదని బదిలీ చేశారు. మదనపల్లె డీవైఈవో కృష్ణప్ప కూడా అధికార పార్టీ నాయకులు చెప్పిందల్లా చేసి వాళ్లను మెప్పించలేక బదిలీ బారిన పడ్డారు. ప్రస్తుతం ఈ పోస్టు ఖాళీగానే ఉంది. మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు సైతం పలువురు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు తట్టుకోలేక బదిలీ చేయించుకుని వెళ్లిపోయారు. కలెక్టర్ ఎదుటే తనను ఎదిరించాడనే కారణంతో తహసీల్దార్ శ్రీనివాసులును ఎమ్మెల్యే బదిలీ చేయించారు. పెద్ద స్థాయి ఉద్యోగులే ఇలా ఉంటే పోలీసు కానిస్టేబుళ్లు, వీఆర్‌వోలు వంటి అనేక చిన్న స్థాయి ఉద్యోగుల సంగతి ఈ ఐదేళ్లలో ఆ దేవుడికే ఎరుక. ఆర్ఐ చాణక్య, డీటీ సయ్యద్ అహ్మద్, వీఆర్‌వో సుస్మితలు సస్పెండ్ అయ్యారు. సర్వేయర్ సుబ్రమణ్యం బదిలీ అయ్యారు. మున్సిపల్ కమిషనర్లు గుర్రం రవి, రఘునాథరెడ్డిలు బదిలీ అయ్యారు. ఇలా పలువురు ఇంజనీరింగ్ అధికారులు, మునిసిపాలిటీ సిబ్బంది, ఎంపీడీవోలు, సబ్‌రిజిస్టర్ ఉద్యోగులు, మెప్మా ఉద్యోగులు, మున్సిపాలిటీలోని కాంట్రాక్టు ఉద్యోగులు బదిలీ బారిన పడ్డారు. బదిలీపై వచ్చిన వారిని వెంటనే విధుల్లో చేర్చుకోకపోవడం, కొందరిని వెనక్కు పంపేయడం.. బదిలీ అయిన వాళ్లకు రిలీవ్ చేయకపోవడం వంటి కారణాలతో.. వందలాది మంది ఉద్యోగులు అధికార పార్టీ నేతల బాధితులుగా మిగిలిపోయారు.
- రాయచోటి మునిసిపల్ కమిషనర్ రాంబాబుపైన ఎమ్మెల్యే అనుచరులు దాడి చేశారు. తాము చెప్పిన పని చేయకపోవడమే ఈ దాడికి కారణం. అదేవిధంగా ఐసీడీఎస్ కార్యాలయంలోనూ ఎమ్మెల్యే అనుచరులు అక్కడి సిబ్బంది ఒకరిపై దాడి చేశారు. సాక్షాత్తూ.. గతంలో జిల్లా ఎస్పీగా ఉన్న హర్షవర్ధన్‌రాజు తాము చెప్పినట్లు వినడం లేదని, కొందరు అధికార పార్టీకి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధులు ఆయనను బదిలీ చేయించారు. నేరం చేయకపోయినా తాము చెప్పిన వాళ్లపై తీవ్రమైన కేసులు నమోదు చేయాలని ఆయనపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. అందుకు ఆయన అంగీకరించకపోవడంతో ఆయనపై ఎటువంటి ఆరోపణలు లేకపోయినా బదిలీ సత్కారం చేశారు.
- టీడీపీ అధినేత చంద్రబాబునాయు డు ప్రాజెక్టుల సందర్శన పేరుతో చేపట్టిన పర్యటన సందర్భంగా అంగళ్లలో జరిగిన దాడి ఘటనకు సంబంధించి అప్పట్లో సీఐగా పని చేస్తున్న సాదిక్‌అలీని రాత్రికి రాత్రే బదిలీ చేశారు. ఈ సంఘటనలో సంబంధం లేని వాళ్లపైన సైతం అక్రమ కేసులు పెట్టమన్న ఒత్తిళ్లను ఆయన ఒప్పుకోకపోవడంతో బదిలీ బహుమతి గా ఇచ్చారు.

జిల్లాలో దాదాపు ప్రతి మండలంలోనూ ఇదే సమస్య కనిపిస్తోంది. పలువురు అధికారులు అధికార పార్టీ నాయకులు చెప్పిందల్లా వింటూ తమ ఉద్యోగాన్ని చేస్తున్నారు. నిబంధనల ప్రస్తావన లేకుండా అధికార పార్టీ నాయకులు చెప్పిన చోటల్లా.. సంతకా లు చేసేస్తున్నారు. ప్రత్యేకంగా ఈ పరిస్థితి రెవెన్యూ లో కనిపిస్తోంది. తర్వాత స్థానం పోలీసు శాఖదనే చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో పలువురు అధికారులు ప్రైవేటు కేసులను సైతం ఎదుర్కొంటున్నారు. కరవమంటే.. కప్పకు కోసం.. విడవమంటే.. పాముకు కో పం.. అనే రీతిలో అధికారులు నలిగిపోతున్నారు. ఈ క్రమంలో తమ కళ్లముందు.. ఇది అన్యాయమని తెలిసినా.. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో అన్యాయాని కే సరే అంటున్నారు. దీంతో ఎంతో కొంత నిజాయి తీగా పనిచేస్తారనే పేరున్న అధికారులు సైతం ప్రజ ల్లో చెడ్డపేరు తెచ్చుకుంటున్నారు. అయితే ఇదే సమయంలో కొందరు అధికారులు.. అధికార పార్టీ నాయకుల పేరు చెప్పి.. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

కాగా ప్రతి కార్యాలయంలోనూ అధికార పార్టీకి చెందిన వ్యక్తులు కొంతమందిని వేగులుగా నియమించుకున్నారు. అక్కడ జరిగే ప్రతి విషయాన్ని వారు ప్రజాప్రతినిధులకు చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరెవరు వస్తున్నారు.. ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతలు అధికారులను కలిస్తే వెంటనే అధికార పార్టీ నేతలకు సమాచారం వెళుతుంది. వెంటనే అక్కడి నుంచి అధికారులకు ఫోన్లు వస్తాయి.. వారు చెప్పిన పని చేయవద్దని హుకుం జారీ చేస్తున్నట్లు కూడా కొందరు అధికారులు వాపోతున్నారు. జిల్లాలోని చాలా తహసీల్దార్ కార్యాలయాల్లో తమ మాట వినని తహసీల్దార్‌లను అక్కడి నుంచి బదిలీ చేయించి డిప్యూటీ తహసీల్దార్లకు అదనపు బాధ్యతలు అప్పగించేలా చేసి అధికార పార్టీ నాయకులు తమ పనులు చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



ఉత్తమ పంచాయతీగా వీవీ కండ్రిక

- జాతీయ అవార్డుకు ఎంపిక
- ఢిల్లీలో అవార్డు అందుకోనున్న సర్పంచ్


వీవీ కండ్రిక సర్పంచ్ శ్రీరాం వినోద్

రైల్వేకోడూరు, జనవరి 24: మండలంలోని వీవీ కండ్రిక ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైంది. అవార్డును ఢిల్లీలో గురువారం జరిగే గణతంత్ర వేడుకల్లో సర్పంచ్ అందుకోనున్నారు. సర్పంచ్ శ్రీరాం వినోద్‌కు గణతంత్ర ఉత్సవాలకు కేంద్ర ప్రభుత్వం ఆహ్వానం పంపిందని రైల్వేకోడూరు ఈవోఆర్‌డీ నాగార్జునరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు మండలంలోని వీవీకండ్రిక పంచాయతీలో నూటికి నూరుశాతం తాగు నీరు ప్రజలకు అందించడంలో సర్పంచ్ చేసిన కృషికి 2023 సంవత్సరంలో ఉత్తమ ఆదర్శ పంచాయతీగా ఎంపికైందన్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్ దినోత్సవంలో సర్పంచ్ వినోద్‌ను సత్కరించారన్నారు. కాగా సర్పంచ్ వినోద్ ఢిల్లీకి పయనమయ్యారన్నారు. గురువారం నిర్వహించే గణతంత్ర ఉత్సవాల్లో ఆయన అవార్డును అందుకుంటారని తెలిపారు.



మహిళలను మోసం చేసేందుకే డ్వాక్రా రుణమాఫీ

- టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

సుండుపల్లె, జనవరి 24 : మహిళలను మోసం చేసేందుకే డ్వాక్రా రుణమాఫీ అంటూ కల్లబొల్లి మాటలు చెబుతున్నారని, వైసీపీ ప్రభుత్వ హయాంలో మహిళా సాధికారత శూన్యమని, నోరు తెరిస్తే అక్కాచెల్లెమ్మలంటూ మాట్లాడే జగన్ ఆచరణలో మాత్రం మహిళలను మోసం చేశారని టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. బుధవారం సుండుపల్లె మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మహిళలే వైసీపీ ప్రభుత్వాన్ని కూల్చివేస్తారన్నారు. జీతాలు పెంచమని వేడుకున్న అంగన్వాడీలను కక్ష గట్టి వారిపై ఉక్కుపాదం మోపిన జగన్‌రెడ్డి ఆసరా మహిళలను ఉద్ధరిస్తానని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. చంద్రబాబు హయాంలో దినదినాభివృద్ధి చెందిన డ్వాక్రా వ్యవస్థను కూకటివేళ్లతో సహా పెకిలిస్తున్న సీఎం ఆసరా పేరుతో మహిళలను ఉద్ధరిస్తామనడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా రుణమాఫీ పక్కాగా చేసిందని, 85 లక్షల మంది డ్వాక్రా మహిళలకు మూడు విడతల్లో ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.8500 కోట్లు మాఫీ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మహిళలకు సమన్యాయం చేయాలనే లక్ష్యంతోనే పసుపు-కుంకుమ కింద 2018-19లో రూ.10 వేల కోట్లు చెల్లించామన్నారు. మహిళలకు ఆస్తి హక్కు, రాజకీయంగా రిజర్వేషన్లు, మహిళా వర్సిటీ ఏర్పాటు, స్థానిక సంస్థలు, ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత టీడీపీదే అన్నారు. సమావేశంలో సుండుపల్లె మాజీ ఎంపీటీసీ మోహన్‌బాబు నాయుడు, టీడీపీ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రహ్మణ్యంనాయుడు, జనసేన వీర మహిళా నాయకులు రెడ్డిరాణి, మైనార్టీ నాయకులు రియాజ్, మహబూబ్‌బాషా, సురేశ్‌నాయుడు, అష్రఫ్, మన్సూర్, దర్బార్, హబీబుల్లా తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయండి

- ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్


పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటిటౌన్, జనవరి 24: భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో అన్ని ఏర్పాట్లు పక్కాగా త్వరగా పూర్తి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన రాయచోటిలోని పోలీస్ పెరేడ్ మైదానంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ భారత గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు గ్రౌండ్, వేదికను పోలీస్, రెవెన్యూ అధికారులు చక్కని అలంకరణతో సిద్ధం చేయాలన్నారు. ప్రజాప్రతినిధులకు, జిల్లా అధికారులకు, స్వాతంత్ర్య సమరయోధులకు, ప్రజలకు సీటింగ్ అరెంజ్‌మెంట్లు ప్రోటోకాల్ ప్రకారం చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారిని ఆదేశించారు. శాఖల ప్రగతిని చూసే శకటాల వివరాలను ఇన్‌చార్జి కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రౌండ్ అంతా పరిశుభ్రంగా సిద్ధం చేయాలన్నారు. ప్రజలందరూ వేడుకలను వీక్షించే విధంగా అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయించాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో రంగస్వామి, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఒకే డోర్ నెంబరుతో ఉన్న ఓట్లు తొలగించండి

- ఆర్డీవోకు జనసేన నేత రాందాస్ చౌదరి వినతి

మదనపల్లె, జనవరి 24: మదనపల్లె నియోజకవర్గంలో ఒకే పోలింగ్ కేంద్రంలో ఒకే డోర్ నెంబరుతో ఉన్న 30, 40, 70 ఓట్లను తొలగించాలని జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రాందాస్‌చౌదరి కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఆర్డీవో మురళిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, ఎన్నికల అధికారులు, బీఎల్‌వోలపై ఎంత ఒత్తిడి చేసినా ఓట్ల సంఖ్య తగ్గుతుందే కానీ..దొంగ ఓట్లను పూర్తిగా తొలగించలేకపోతున్నట్లు తెలిపారు. కొత్త జాబితాను మరోసారి పరిశీలించి దొంగ ఓట్లను తొలగించకపోతే కలెక్టర్‌కు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంలో జనసేన-టీడీపీలు రాజీలేని పోరాటం చేస్తాయని ప్రకటించారు. అవసరమైతే న్యాయస్థానానికి కూడా వెళతామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, రాష్ట్ర చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర, రూరల్ అధ్యక్షుడు గ్రానైట్ బాబు, కావలి రెడ్డెమ్మ, సరోజ, తోట కళ్యాణ్, గిరి, రూరల్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, లవన్న, జంగాల గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవో మురళికి వినతిపత్రం ఇస్తున్న జనసేన నేత గంగారపు రాందాస్‌చౌదరి, జంగాల శివరాం తదితరులు

బాలికల పరిరక్షణ అందరి బాధ్యత


- ఇన్‌చార్జ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి టౌన్, జనవరి 24: బాలికల పరిరక్షణ అందరి బాధ్యత అని ఇన్‌చార్జ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం రాయచోటి పట్టణంలోని డైట్ స్కూల్ వద్ద ఆయన జెండా ఊపి అవగాహనా ర్యాలీని ప్రారంభించారు. డైట్ స్కూల్ నుంచి నేతాజీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ బాలికా సంరక్షణతో పాటు సాధికారత కల్పించే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాజ్యాంగబద్ధంగా బాలికలకు కల్పించిన హక్కులను గౌరవించాలన్నారు. ఆడపిల్లలకు మగపిల్లలతో సమానంగా అవకాశాలు మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. భ్రూణ హత్యల నిరోధాన్ని సామాజిక బాధ్యతగా తీసుకుని వ్యతిరేకించాలన్నారు. పిల్లల పెంపకంలో బాలబాలికల మధ్య తల్లిదండ్రులు తేడాలు చూపవద్దని తెలిపారు. చిన్నతనం నుంచే బాలికలకు అవకాశాలు కల్పించినప్పుడే సమాజంలో మార్పు సాధ్యం అవుతుందన్నారు. ఆడపిల్లలకు ప్రభుత్వ పరంగా చాలా అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ర్యాలీలో డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య, ఐసీడీఎస్ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, డైట్ స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉసూరంటున్న ఉపాధి కూలీలు

- మూడు నెలలుగా 'కూలి' కోసం ఎదురు చూపులు
- పేరుకుపోయిన రూ.19 కోట్ల బకాయిలు
- 16 లక్షల నుంచి 2 లక్షలకు పడిపోయిన పనిదినాలు


రైతులకు పొలం పనికి వెళితే ఏ రోజు కూలి డబ్బు ఆ రోజు చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. అదే భవన నిర్మాణ కార్మికులకు అయితే కనీసం వారానికి ఒకసారి చెల్లిస్తారు. ఇది యజమానికి కూలీలకు మధ్య ఉండే అవగాహన మేరకు జరుగుతుంది. కానీ ప్రభుత్వం ద్వారా అమలవుతున్న ఉపాధి హామీలో కూలీలకు వారానికి ఒకసారి చెల్లింపులు చేయడం తప్పనిసరి. లేదంటే బాధ్యులైన అధికారులకు జరిమానా ఉంటుంది. ఇది చట్టపరమైన నిబంధన. కానీ వారానికి కాదు కదా రెండు మూడు నెలలు గడుస్తున్నా ఉపాధి హామీ కూలీలకు కూలి డబ్బు చెల్లించడానికి ప్రభుత్వానికి చేతులు రావడం లేదు. వారం వారం అధికారులు బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నా నిధులు విడుదల కాకపోవడంతో లక్షలాది కూలీలకు జిల్లాలో రూ.కోట్లలో బకాయిలు పేరుకుపోయాయి. వరుస పండుగలు వస్తూ వెళ్లిపోతున్నా కూలీల కుంపటి మాత్రం బోసిపోవడం షరా మామూలైంది.



కలికిరి, జనవరి 24: జిల్లాలో రెండున్నర నెలలుగా ఉపాధి హామీ కూలీలకు కూలి డబ్బులు ఆగిపోయాయి. రేపో మాపో వస్తాయన్న ఆశ చావక పనులకు వెళుతున్న వారికి నిరాశ మాత్రమే మిగులుతోంది. వారం వారం చెల్లింపుల మాట దేవుడెరుగు కనీసం నెలకు కూడా చెల్లింపులు జరగడం లేదు. ప్రస్తుతం రెండున్నర నెలల పైబడి చెల్లింపులు నిలిచిపోయాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో చెల్లింపు బిల్లులన్నీ పేరుకుపోయాయి. గత సంవత్సరం అక్టోబరులో రెండు వారాలు చెల్లింపులు జరిగినా ఆ తరువాత దాదాపు మూడు నెలలుగా కూలీ బకాయిలు పేరుకుపోయాయి. జిల్లాలోని మొత్తం 30 మండలాల్లోని కూలీలకు దాదాపు రూ.19 కోట్ల మేర చెల్లించాల్సి ఉంది. వేతనాలు చెల్లించకపోవడంతో దాని ప్రభావం పనులపైన తీవ్రంగా పడుతోంది. కింది స్థాయి ఉద్యోగులపై ఎంత ఒత్తిడి పెంచినా కూలి డబ్బులు చెల్లించకపోవడంతో పనులకు రావడానికి కూలీలు ససేమిరా అంటున్నారు. ఫలితంగా గత ఏప్రిల్‌లో జిల్లా మొత్తం 16 లక్షల పనిదినాలు కల్పించగా, డిసెంబరు చివరి నాటికి అది కాస్తా 2 లక్షల 75 వేల మంది కూలీలకు పడిపోయింది. అదేవిధంగా ఏప్రిల్ నెలలో మొత్తం 87 వేల కుటుంబాలు హాజరు కాగా డిసెంబరు నెలలో ఆ కుటుంబాల సంఖ్య కేవలం 27 వేలకు పడిపోయింది.

ముఖం చాటేస్తున్న ఉపాధి కూలీలు

జిల్లాలో కేవలం ఉపాధి హామీ పనులపై ఆధారపడి దాదాపు లక్ష కుటుంబాలు జీవిస్తున్నారు. ఒక్కో కుటుంబానికి రూ.పది వేల నుంచి 15 వేల వరకూ బకాయిలు నిలిచిపోవడంతో పనులకు రావడానికి కూలీలు ముఖం చాటేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా రామాపురం మండలంలో ఏప్రిల్ నెలలో 95 వేల పనిదినాలు నమోదు కాగా డిసెంబరు నాటికి అవి కేవలం 10 వేలకు పడిపోయాయి. రైల్వేకోడూరులో ఏప్రిల్‌లో 87 వేల పనిదినాలుండగా డిసెంబరు నాటికి దారుణంగా 4వేల లోపు పడిపోయాయి. చిన్నమండెంలో 79 వేల నుంచి 8 వేలకు, లక్కిరెడ్డిపల్లెలో 76 వేల నుంచి 5వేలకు, ములకలచెరువులో 79 వేల నుంచి 23 వేలకు, పెద్దమండెంలో 90వేల నుంచి 18వేలకు, పెనగలూరులో 67వేల నుంచి కేవలం 7 వేలకు పనిదినాల సంఖ్య పడిపోయింది. గాలివీడులో 50 వేల నుంచి 5 వేలకు, కలకడలో 40వేల నుంచి 5వేలకు, ఓబులవారిపల్లెలో 56 వేల నుంచి 3 వేలకు, రాజంపేటలో 44 వేల నుంచి 3వేలకు, పడిపోయాయి. పుల్లంపేటలో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంది. గత ఏప్రిల్ నెలలో ఈ మండలంలో 82 వేల పనిదినాలు నమోదు కాగా డిసెంబరు నాటికి అవి కాస్తా 2600 పడిపోయాయంటే నిధుల లేమి కారణంగా కూలీలపై పడిన ప్రభావాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. దాదాపు జిల్లా మొత్తం ఇదే పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. జనవరి నెలలో కూలీల సంఖ్య మరీ దారుణంగా ఉందని, బలవంతపెట్టినా పనులకు రావడం లేదని క్షేత్ర స్థాయి ఉద్యోగులు వాపోతున్నారు. ఇప్పటి వరకు దాదాపు 7.5 లక్షల పనిదినాలకు పైబడి చెల్లింపులు జరగాల్సి ఉంది. జిల్లా మొత్తం మీద ఒక్కో పనిదినానికి సరాసరిన రూ.231 నుంచి 265 వంతున చెల్లించాల్సి ఉంది. మొత్తం మీద రూ.19 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి.



ప్రతిసారీ ఇదే తతంగం!

ఉపాధి హామీ సిబ్బంది నానా పాట్లు పడి కూలీలను పోగు చేయడం.. నెలల తరబడి వేతనాల చెల్లింపులు ఆగిపోవడంతో కూలీలకు వెనక్కుపోవడం నాలుగేళ్లుగా పరిపాటిగా మారింది. కేంద్రం నుంచి నిధులు రావడం లేదా వచ్చిన నిధులు దారి మళ్లిస్తున్నారా అనే విషయంలో మాత్రం అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. వేతనాల చెల్లింపులు ప్రతిబంధకం కావడంతో పనులు మందగించడానికి దారి తీస్తోందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. 2022 డిసెంబరులో ఇదేవిధంగా రూ.25 కోట్ల వరకూ బకాయిల చెల్లింపులు నిలిచిపోయాయి. ఆ తరువాత నెమ్మదిగా చెల్లింపులు చేసినా చివరికి రూ.12 కోట్లు పైబడి బకాయిపడ్డారు. దీనిపైన 2022 డిసెంబరు 8న 'ఉద్యోగులకు, కూలీలకు ఇదేం ఖర్మ' పేరుతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపైన రూ.12.32 కోట్లు చెల్లించాల్సి ఉన్న మాట వాస్తవమేనని, రెండు మూడు వారాల్లో బకాయిలన్నీ పూర్తి చేస్తామని జిల్లా డ్వామా కార్యాలయం వివరణ ఇచ్చింది. అయితే ఈ వివరణ ఇచ్చిన మరుసటి రోజే అనూహ్యంగా మొత్తం బకాయిలన్నీ ఒక్క రోజులోనే చెల్లించేశారు. ఆంధ్రజ్యోతి కథనం ప్రభుత్వాన్ని కదిలించడంతో అధికారులు కూడా ఊహించని విధంగా 24 గంటల్లో నిధులు విడుదల కావడం, చెల్లింపులు పూర్తి కావడం అప్పట్లో విశేషం. ప్రతి ఏడాది ఈ బకాయిలు పేరుకుపోవడమన్నది ఉపాధి హామీ పనుల పురోగతిపై తీవ్ర ప్రభావం చూపుతోందని సర్వత్రా విమర్శలున్నాయి.

పర్యాటక వారసత్వాన్ని స్ఫురింపజేసేది అలపర్తి రచన

● వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైస్ చాన్సలర్ చింతా సుధాకర్, తదితరులు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 24 : భారత దేశానికి ఎంతో గొప్ప చరిత్ర ఉందని, అందులోని సంస్కృతి వారసత్వాన్ని రేపటి తరానికి పర్యాటకం పేరుతో పుస్తకాన్ని పరిచయం చేసిన రచయిత అలపర్తి పిచ్చయ్యచౌదరి కృషి ప్రశంసనీయమని వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ తెలిపారు. బుధవారం కడప నగరం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యామండలి విశ్రాంత సంయుక్త కార్యదర్శి పిచ్చయ్యచౌదరి రచించిన పర్యాటకం రూట్స్ అండ్ ఫ్రూట్స్ ఆఫ్ టూరిజం పుస్తకాన్ని ఆవిష్కరించారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఇంటాక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా సుధాకర్ మాట్లాడుతూ భారతదేశం దేవతలు నడయాడిన భూమి అని, అందుకే కర్మభూమిగా అభివర్ణిస్తామని పేర్కొంటూ.. ప్రపంచ దేశాలన్నింటికంటే మనదేశానికి గొప్ప చారిత్రక నేపథ్యం ఉందని వివరించారు. ఇంటాక్ కడప చాప్టర్ చైర్మన్ కె.చిన్నపరెడ్డి, ప్రిన్సిపల్ వి.సలీంబాషా, జి.రవీంద్రనాథ్, వైవీయూ పాలక మండలి సభ్యులు ప్రొఫెసరు మల్లిఖార్జున రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌రాజు, ఎస్ఎండీ బాషా, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మలూరు సురేష్‌బాబు పాల్గొన్నారు.

మూగ జీవాల పట్ల కరుణ చూపాలి : కలెక్టర్

కడప(కలెక్టరేట్), జనవరి 24: ప్రతి ఒక్కరూ మూగ జీవాలపట్ల ప్రేమ, కరుణ చూపేలా సమాజంలో అవగాహన పెంచాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో ఎస్పీసీఏ జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నెల 14వ తేదీ నుంచి 30 వరకు జిల్లాలో నిర్వహిస్తున్న జంతు సంక్షేమ పక్షోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. అందులో భాగంగా గోశాలల సందర్శనతో పాటు పాఠశాలల్లో కైండ్‌నెస్ క్లబ్బులు, జంతువుల పట్ల దయతో వ్యవహరించడం వంటి అంశాలపై అవగాహన పెంపొందించేలా విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహిం చాలన్నారు. ఫిబ్రవరి 14న వసంత పంచమి రోజున 'జీవ జంతు కళ్యాణ్ దివస్' కార్యక్రమాన్ని అన్ని కార్యాలయాల్లో నిర్వహించాలన్నారు. జంతు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డి, ఏఎస్పీ తుషార్ డూడి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఆంగ్లంపై నైపుణ్యం కలిగి ఉండాలి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 24: ప్రతి ఉపాధ్యాయుడు ఆంగ్లంపై నైపుణ్యం కలిగి ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి తెలిపారు. బుధవారం కడప నగరం జయనగర్ జడ్పీ బాలికోన్నత పాఠశాలలో స్టాండర్డ్ టెస్ట్ ఆఫ్ ఇంగ్లీషు ప్రొఫెషియన్సీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆంగ్ల నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఇదొక పెద్ద అవకాశమని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎస్‌సీఈఆర్‌టీ పర్యవేక్షకుడు డాక్టర్ గిరిబాబు యాదవ్, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి ధనలక్ష్మి, కోర్సు డైరెక్టరు భాగ్యవతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈవో రాఘవరెడ్డి

పరిహారం ఎప్పుడిస్తారో?

● జాతీయ రహదారికి ఇళ్లు కోల్పోతున్న బాధితుల ఆవేదన
● 60 మందికి అందని పరిహారం


లక్కిరెడ్డిపల్లెలోని జడ్పీ పాఠశాల నుంచి మిస్సా చర్చి వరకు పరిహారం ఇవ్వని ఇళ్లు

లక్కిరెడ్డిపల్లె, జనవరి 24: వేంపల్లె నుంచి రాయచోటి వరకు ఏర్పాటు చేస్తున్న జాతీయ రహదారిలో భాగంగా లక్కిరెడ్డిపల్లె మండల కేంద్రంలో స్థలాలు, ఇళ్లు కోల్పోతున్న బాధితులకు కొందరికి పరిహారం అందలేదు. పనులు ప్రారంభించి రెండేళ్లయినా తమకు ఇంకా పరిహారం అందకపోవడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్కిరెడ్డిపల్లె మండల కేంద్రంలో 366 మంది బాధితులకు 33.88 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. చింతకుంటపల్లె నుంచి లక్కిరెడ్డిపల్లె మిస్సా చర్చి వరకు రోడ్డుకు ఇరుపక్కల ఉన్న ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న కొంతమంది బాధితులకు మాత్రమే పరిహారం అందించారు. అయితే వీరిలో చింతకుంటపల్లె నుంచి లక్కిరెడ్డిపల్లె బాలుర హైస్కూల్ వరకు 280 మందికి పరిహారాన్ని అందించారు. మిగిలిన 86 మంది బాధితులకు రెండు సంవత్సరాలైనా ఇంతవరకు పరిహారం ఇవ్వలేదని బాధితులు వాపోతున్నారు. అయితే ఇప్పటికే లక్కిరెడ్డిపల్లె, చింతకుంటపల్లె రోడ్డుకు ఇరుపక్కల ఇళ్లను పగలకొట్టి పనులు చేస్తున్నారు. మిగిలిన వాటి గురించి పట్టించుకునే నాథుడే లేరని బాధితులు వాపోతున్నారు. హైస్కూల్ గేటు నుంచి మిస్సా చర్చి వరకు ఉన్న ఇళ్లకు ఇంతవరకు పరిహారం అందించలేదని, వాటి గురించి పట్టించుకొనే నాథుడే లేరని బాధితులు అంటున్నారు. 60 ఇళ్లు కోల్పోతున్నవారు మాకు పరిహారం తక్కువ రాశారని ఈ విషయంపై రెవెన్యూ అధికారులను అడిగితే జాతీయ రోడ్లు రవాణా వారు వేసి ఇచ్చిన ఎస్టిమేషన్ ప్రకారం కొలతలను బట్టి పరిహారం కోసం కలెక్టర్‌కు నివేదికలు పంపించామని చెబుతున్నారన్నారు. 20 అడుగులు స్థలం కోల్పోయిన వారికి కేవలం 5 నుంచి 7 లక్షల రూపాయలు మాత్రమే ఇస్తున్నారని మాకు న్యాయం జరగలేదని బాధితులు అంటున్నారు. దీనికి తోడు 1190, 1191 సర్వే నెంబర్లు గల ఈ భూమిని వేరే వ్యక్తి 50 సంవత్సరాలు క్రితం 5 ఎకరాలు విక్రయించారని అందులో రోడ్డుకు కోల్పోతున్న భూమి తమ పెద్దల పేరిట ఉందని పెండింగ్ పెట్టినట్లు బాధితులు చెబుతున్నారు. అయితే 366 ఇళ్లు, స్థలాలు రోడ్డుకు కోల్పోతున్న బాధితులకు 33 కోట్ల 88 లక్షల 82 వేల రూపాయలు మంజూరైందని, సరైన డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్ కాగితాలు కలిగిన వారికి మాత్రం ఎస్టిమేషన్, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందిస్తున్నామని రెవెన్యూ అధికారులు అంటున్నారు. అయితే మొత్తం 366 మంది బాధితులకు 10 నుంచి 20 మీటర్లు స్థలం, ఇల్లు కోల్పోతున్న వారికి తక్కువ పరిహారం ఉందని ఈ విషయాన్ని అధికారులను అడిగితే స్థలం, ఇల్లు నిర్మాణం విలువను బట్టి నివేదికలు పంపించామని అధికారులు అంటున్నారని బాధితులు మహ్మద్‌రఫీ, సుబ్బరాజు, నందిబాబు తెలిపారు. ఇప్పటికే 30 కోట్ల రూపాయలు బాధితుల ఖాతాల్లో వేశామని, ఇంకా 10 కోట్ల రూపాయలు రావాలని ఆ డబ్బు వచ్చిన వెంటనే మిగిలిన 60 మందికి పరిహారం వారి ఖాతాల్లో వేస్తామని రెవెన్యూ అధికారులు అంటున్నారు. పరిహారం కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పరిహారం అందడం లేదని బాధితులు వాపోతున్నారు.

10 కోట్ల రూపాయలు రావాలి..

మండలంలో జాతీయ రహదారికి ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న 366 కుటుంబాల నివేదికలు పంపించాం. అందులో ఎలాంటి సమస్యలు లేని ఇళ్లకు పరిహారం అందించాం. ఇంకా 86 ఇళ్లు ఉన్నాయి అందులో 26 కుటుంబాలకు చెందిన ఆస్తులకు సరైన పత్రాలు లేవు. మిగిలిన 60 కుటుంబాలకు రెండో విడతలో పంపిణీ చేస్తాం. లక్కిరెడ్డిపల్లె టౌన్‌లో అందరికీ పరిహారం అందించనంతవరకు ఇళ్లు పగలగొట్టం.

- ఉదయశంకర్‌రాజు, తహసీల్దార్

ఎవరూ పట్టించుకోవడం లేదు..



2020 సంవత్సరంలో కొత్త ఇల్లు కొన్నాను. జాతీయ రహదారికి 2.7 మీటర్లు స్థలం కోల్పోయాను. ఈ విషయంపై ఎన్నోసార్లు అధికారులను అడిగినా పటించుకోలేదు. అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్ పేపర్లు ఇచ్చాం కానీ ఎవరూ పట్టించుకోలేదు. పరిహారం ఇచ్చిన తర్వాతే ఇల్లు పడగొట్టండి. లేకుంటే అందుకు ఒప్పుకునేదే లేదు.

- దర్బార్‌బాషా, బాధితుడు

స్థలం పోయేది ఎక్కువ.. పరిహారం తక్కువ..



రోడ్డుకు 20 అడుగుల స్థలం పోతుంది. ఈసీ విలువ 15 లక్షల రూపాయలు ఉంది. రూ.5 లక్షలు మాత్రమే వస్తుందని అధికారులు అంటున్నారు. స్థలానికి తగ్గట్టు పరిహారం అందించాలి, లేదంటే ఇంటిని కూల్చనీయం. మొదటి నుంచి ఇటువైపు స్థలం గల వారు ఎవరో కోర్టుకు వెళ్లారని పరిహారం ఇవ్వకుండా అధికారులు నాన్చుతున్నారు. ఈసీ ప్రకారం పరిహారం చెల్లించాలి.

- సుబ్బరాజు, బాధితుడు

రామాలయంలో దొంగలు పడ్డారు

బంగారు గొలుసు, వెండి కిరీటాలు అపహరణ



వేంపల్లెలో చోరీ జరిగిన రామాలయం, సీతారాముల వద్ద రోల్డ్‌గోల్డ్ నగలు

వేంపల్లె, జనవరి 24: వేంపల్లె పట్టణం పులివెందుల రోడ్డులోని టీచర్స్ కాలనీ రామాలయంలో దొంగలు పడ్డారు. మంగళవారం అర్ధరాత్రి దాటాక గుర్తుతెలియని దొంగలు ఆలయం తలుపు చిలుకులను పెకిలించి దొంగతనం చేశారు. సీతాదేవి బంగారు గొలుసు, సీతారామలక్ష్మణ హనుమ విగ్రహాల వెండి కిరీటాలు ఇతర ఆభరణాలు దోచుకెళ్లారు. సుమారు నాలుగు లక్షల రూపాయల విలువైన బంగారు, వెండి ఆభరణాలు తీసుకెళ్లినట్లు కాలనీ వాసులు తెలిపారు. సీఐ చాంద్‌బాష ఆలయాన్ని పరిశీలించి స్థానికులను విచారించారు. పూర్తి వివరాలిలా.. వేంపల్లె పట్టణ సమీపంలోని పులివెందుల సమీపంలో టీచర్స్ కాలనీ వద్ద రామాలయం ఉంది. అయోధ్య బాలరాముడి ప్రతిష్ఠ పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు ఆభరణాలు అలంకరించి పూజలు చేశారు. వీటి గురించి తెలిసి గుర్తుతెలియని దొంగలు పక్కా ప్రణాళికతో మంగళవారం అర్ధరాత్రి దాటాక ఆలయం చిలుకును పెకలించి బంగారు, వెండి ఆభరణాలను తీసుకెళ్లారు. రోల్డ్‌గోల్డ్ నగలను ఉంచి వెళ్లారు. దీన్ని బట్టిపూర్తి సమాచారం తెలుసుకున్న వారే ఈ దొంగతనం చేసినట్లు ప్రాథమికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నాలుగు రోజులు జైలు శిక్ష

నందలూరు, జనవరి 24: మద్యం తాగి వాహనం నడిపినందుకు ఆవుల పులికొండ అనే వ్యక్తికి నందలూరు జూనియర్ సివిల్ జడ్జి లత నాలుగు రోజుల జైలుశిక్ష విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన ఆవుల పులికొండ అనే వ్యక్తిని డ్రంకెన్ డ్రైవ్ కేసులో స్థానిక పోలీసులు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 4 రోజులు జైలుశిక్ష విధించారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం రాజంపేట సబ్‌జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం లారీ బోల్తా



పోరుమామిళ్ల, జనవరి 24 : కలసపాడు మండలంలోని చింతలపల్లె సమీపంలో మద్యం లారీ బోల్తా పడింది. సింగరాయ కొండ నుంచి కడపకు మద్యం తీసుకువెళుతున్న లారీ బుధవారం తెల్లవారుజామున చింతలపల్లె సమీపంలో రోడ్డుకిరువైపులా తూములు ఉండడంతో ఎదురుగా బండి రావడంతో పక్కనున్న గుంత కనబడక బోల్తాపడింది. వెంటనే డ్రైవర్లు కలసపాడు పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించారు. వారు సంఘటనాస్థలానికి చేరి ఎవరూ మద్యం తీసుకుపోకుండా చర్యలు తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి



ముద్దనూరు, జనవరి24: మండల పరిధి కడప-తాడిప్రతి హైవేలోని చింతకుంట గ్రామ సమీపంలో మోటర్ బైకు గుంతలో పడిన ఘటనలో గాయపడిన జీవన్‌కుమార్(16)అనే యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు.అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన జీవన్‌కుమార్ శనివారం ముద్దనూరు వైపు నుంచి తన స్నేహితుడు మోక్షేశ్వరరెడ్డితో కలిసి మోటార్ బైకులో తాడిపత్రికి వెళుతుండగా చింతకుంట సమీపంలో ప్రమాదవశాత్తు బ్రిడ్జి ఏర్పాటు కోసం తీసిన గుంతలో పడ్డారు. ఈ ప్రమాదంలో బైకుపై వెళుతున్న ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. జీవన్‌కుమార్ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గణతంత్ర వేడుకలకు పక్కా ఏర్పాట్లు చేయండి : జేసీ

కడప(కలెక్టరేట్), జనవరి 24: గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ గణేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లపై అదనపు ఏఎస్పీ కృష్ణారావు, డీఆర్వో గంగాధర్ గౌడ్‌లతో కలసి అన్ని శాఖల అధికారులతో జేసీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈనెల 26న స్థానిక పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకల్లో జెండా వందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి సంబంధించి జిల్లాలో సాధించిన ప్రగతిని చాటి చెప్పేలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాళ్లు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మధుసూదన్, డ్వామా పీడీ యదుభూషణ్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాలను నియంత్రించాలి

● ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్


సమావేశంలో మాట్లాడుతున్న ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 24: జిల్లాలో మాతా శిశు మరణాల జరగకుండా నియంత్రించేందుకు అవసరమైన పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మాతా శిశు మరణాల నివారణపై వైద్య, ఆరోగ్య శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాతృమరణాలు, శిశు మరణాలు జరగకుండా సంబంధిత అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. పీహెచ్‌సీల పరిధిలో హైరిస్క్ ప్రెగ్నెన్సీ ఉన్న వారిని గుర్తించడం లేదని, హైరిస్క్ ఉన్న వారిని గుర్తించాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం, ఆశావర్కర్లు, మెడికల్ అధికారులు సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు.

సీహెచ్‌సీ, పీహెచ్‌సీలలో సమావేశాలు నిర్వహించినప్పుడు ఏఎన్ఎంలు, ఆశావర్కర్లకు మాతా శిశు మరణాలపై అవగాహన కల్పించాలన్నారు. ఇక నుంచి హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో సమావేశాలు పెట్టుకుని మరణాలు సంభవించకుండా ఉండేటట్లు వారికి తెలియజేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వస్తున్న హైరిస్క్ గర్భిణులను పరీక్షించి వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్, డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య, డాక్టర్లు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు ముందు చేసుకోవడం తెలియదా !

● అధికారులపై జేసీ మండిపాటు


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జేసీ గణేశ్‌కుమార్

మైదుకూరు, జనవరి 24 : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్న స్థానిక అధికారులపై జేసీ గణేశ్‌కుమార్ మండిపడ్డారు. మైదుకూరులో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో తొలినుంచి అధికారులు చిత్తశుద్ధిగా వ్యవహరించలేదనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయిలో పోటీలు కూడా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపక పోవడంతో జాయింట్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పోటీలు ఉదయం 8.30 గంటలకే ప్రారంభం కావాల్సిఉండగా ఏర్పాట్లకు తగిన పరికరాలు లేకపోవడంతో 10.30కి ప్రారంభించారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కూడా ఆటలు ప్రారంభం కాక మునుపే 9 గంటల ప్రాంతంలో వచ్చి కేవలం క్రీడాకారులను పరిచయం చేసుకొని వెళ్లిపోయారు.

క్రికెట్ ఆడేందుకు పిచ్‌పైన మ్యాట్ లేక పోవడం, ఆట ప్రారంభించడంతో క్రీడాకారులు వెయిట్ చేశారు. ఈ క్రమంలోఆకస్మికంగా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ అక్కడికి చేరుకోవడం, విషయం తెలుసుకొని సంబంధిత అధికారులతో క్రీడలకు తగిన ఏర్పాట్లు ఎందుకు చేసుకోలేదు, త గిన పరికారాలు అన్ని కూడా ముందే మీకు పంపాము కదా ఇంత నిర్లక్ష్యం అయితే ఎలా అంటూ మండిపడ్డారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటరమణ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి చంద్రమోహన్, తహసీల్దారు అనురాధ, కమిషనరు రంగస్వామి, ఎంఈవో పద్మలత తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షురాలిగా సమీరా



కడప (ఎడ్యుకేషన్), జనవరి 24: ఏఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షురాలిగా సమీరా ఏకగ్రీవంగా ఎంపికైనట్లు జాతీయ ఉపాధ్యక్షుడు సాయిక్రిష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సమీరా మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అనునిత్యం కృషి చేస్తామన్నారు. విద్యార్థి, విద్యాశాఖ సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు.

పరిపూర్ణ మనుషులుగా మార్చడం అభినందనీయం

కడప (క్రైం), జనవరి 24 : ఖైదీలను పరిపూర్ణ మనుషులుగా మారుస్తున్నారని జైలు అధికారుల పనితీరును వైవీయూ ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డి కొనియాడారు. కడప కేంద్ర కారాగారంలోని ఆడిటోరియంలో పునశ్చరణ తరగతులు రెండోరోజు 8 జిల్లాలకు సంబంధించి జైలు సిబ్బందితో నిర్వహించారు. కడప సెంట్రల్ జైలు పర్యవేక్షణాధికారి ఐఎన్‌హెచ్ ప్రకాశ్ ఆధ్వర్యంలో ఈ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో జైలు అధికారులు రాజేశ్వర్‌రావు, జవహర్ బాబు, సాంబశివరావు, భాస్కర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ ఖేలో ఇండియాకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు


చాంపియన్ షిప్‌కి ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, జనవరి 24: ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఖేలో ఇండియా సౌత్‌జోన్ కింద చాంపియన్‌షిప్‌కు ఎంపికైనట్లు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి గుప్త పేర్కొన్నారు. ఖేలో ఇండియా సౌత్ జోన్ యోగా పోటీల్లో వివిధ విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులను, యోగా శిక్షకులను బుధవారం ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో డైరెక్టర్‌తో పాటు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ షంషాద్‌బేగం, సాంస్కృతిక డ్యాన్స్ మాస్టర్ ఖాన్‌బాషాలు అభినందించారు.

విద్యార్థులతో ట్రైనీ కలెక్టర్ సహపంక్తి భోజనం


బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ట్రైనీ కలెక్టర్

ఎర్రగుంట్ల, జనవరి 24: ట్రైనీ కలెక్టర్ భరద్వాజ ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాలను బుధవారంసందర్శించారు. మధ్యాహ్నం ఆయన తరగతి గదుల్లోకెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. కొన్ని జనరల్ ప్రశ్నలు వేసి వారితో సమాధానం రాబట్టారు. అలాగే మధ్యాహ్న భోజనం ఎలావుందని అడిగారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజన చేశారు. హెడ్‌మాస్టర్ రామాంజనేయరెడ్డి పాఠశాల స్థితిగతులను ఆయనకు వివరించారు. ల్యాబ్ మరికొన్ని వసతులపై జేసీ ఆరా తీశారు. ఈకార్యక్రమంలో ఎంఈవో శివప్రసాద్, హెచ్ఎం రామాంజనేయరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ శిక్షణలో ఖాదర్‌బాషా



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్, జనవరి 24: నెల్లూరు నగరంలో బుధవారం జరిగిన టీడీపీ జోన్-4 ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం ద్వారా చంద్రబాబు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లామన్నారు. జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ టీడీపీకి అండగా నిలిచి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

పేకాట రాయుళ్లు అరెస్ట్

సంబేపల్లె, జనవరి 24: మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె గ్రామం కొండావాడపల్లెలో పేకాట ఆడుతున్న ముగ్గురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ బుధవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,015 సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలపై స్థానికులకు సమాచారం అందించాలని తెలియజేశారు.

ఘనంగా టీడీపీ సమావేశం

సిద్దవటం, జనవరి 24: మండలంలోని గ్రామ పంచాయతీ భవాని కళ్యాణ మండపంలో బుధవారం టీడీపీని బలోపేతం చేసేందుకు పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల నాయకుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బీసీలకు న్యాయం జరగాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి దశరథనాయుడు, పార్లమెంటు ఉపాధ్యక్షుడు చంద్రయ్య, టీడీపీ మండల యువనాయకుడు రాజేశ్ నాయుడు, అయ్యప్పనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంఘాలను బలోపేతం చేసుకోండి

రామాపురం, జనవరి 24: వైఎస్‌ఆర్ ఆసరా సొమ్ముతో సంఘాలను బలోపేతం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన రామాపురం ఆర్సీఎం చర్చి ప్రాంగణంలో జరిగిన ఆసరా నాల్గవ విడత సదస్సు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో వైఎస్‌ఆర్ నాల్గవ విడత కింద 479 సంఘాలకు రూ.3.26 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గడికోట జనార్ధన్‌రెడ్డి, జడ్పీటీసీ మానస వెంకట్రమణ, మాజీ రెస్కో చైర్మన్ కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్లపు విశ్వనాధరెడ్డి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు కొండారెడ్డి మృతి

సంబేపల్లె, జనవరి 24: గురిగింజకుంట గ్రామం టీడీపీ నాయకుడు కొండారెడ్డి బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ టీడీపీ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలు కొండారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. ఈయన మృతితో పార్టీ ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

చిన్నమండెం, జనవరి 24: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బాలికల హక్కులపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో మల్లూరు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించి ప్రతిభ చూపారని ప్రధానోపాధ్యాయుడు రెడ్డెన్న తెలిపారు. పదవ తరగతి విద్యార్థి చిట్టి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి, జ్యోష్ణ ద్వితీయ బహుమతులు సాధించారన్నారు. వీరిని డీఈఓ అభినందిస్తూ నగదు (చెక్కు) బహుమతులను అందించినట్లు తెలిపారు.

యూటీఎఫ్ నేతలకు నోటీసులు

ఒంటిమిట్ట, జనవరి 24: యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబుకు బుధవారం ఒంటిమిట్ట పోలీసులు స్థానిక పెన్నపేరూరు పాఠశాలలో విధుల్లో ఉండగా నోటీసులు జారీ చేశారు. విజయవాడలో జరుగనున్న మున్సిపల్ ఉపాధ్యాయుల సభకు హాజరుకావద్దని సూచించారు. సాయంత్రం అదుపులోకి తీసుకొని సీఐ పురుషోత్తంరాజు ఎదుట హాజరుపరిచారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

ఒంటిమిట్ట, జనవరి 24: మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సిద్దారపు నరసింహులు (55) అనే ఉపాధ్యాయుడు బుధవారం మృతి చెందాడు. గత కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

అర్ధాంతరంగా ఆగిన నిర్మాణాలు

● కుంటుపడుతున్న సచివాలయ సేవలు ● పట్టించుకోని అధికారులు, పాలకులు



మాచిరెడ్డిగారిపల్లె గ్రామంలో అర్ధాంతరంగా ఆగిన సచివాలయ నిర్మాణం



జీకేరాచపల్లె గ్రామంలో కంపచెట్ల మధ్య అసంపూర్తిగా సచివాలయ నిర్మాణం

సుండుపల్లె, జనవరి 24: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ మూన్నాళ్ల ముచ్చటగా మారింది. అన్నీ సగం సగం పనులే తప్పా మండలంలో జరిగిన అభివృద్ధి కానరాలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోవడంతో సేవలు తూతూ మంత్రంగానే ఉన్నాయి. సచివాలయ సేవలు ఆదర్శంగా నిలుస్తాయని చెప్పిన మాటలు నేటికీ నీటిపై రాతల్లా మారిపోయాయని జోరుగా విమర్శలున్నాయి.

మండల వ్యాప్తంగా 15 గ్రామ సచివాలయ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. సచివాలయ నిర్మాణాలు దాదాపుగా అధికార పార్టీకి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులకే అప్పజెప్పారు. కానీ ఇప్పటివరకు ఏడు సచివాలయాలు మాత్రమే పూర్తి కావడంతో ప్రారంభించారు. మరో 2 సచివాలయాలు పూర్తయినా.. ప్రారంభించలేదు. ఇందులో సుండుపల్లె-2 సచివాలయం ఒకటి. నిర్మాణం పూర్తయినా సుమారు ఆరు నెలలు నుంచి ప్రారంభించడానికి నోచుకోలేదు. అద్దె భవనంలో సచివాలయం నడుపుతూ అద్దె కడుతున్నారు. అయితే కొన్ని రాజకీయ కారణాలతో ప్రారంభానికి నోచుకోలేదని సచివాలయ ఉద్యోగులే గుసగుసలాడుకుంటున్నారు. గిరిజన గ్రామ పంచాయతీ అయిన మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ నడిఒడ్డున సచివాలయ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అయితే సగం పనులను మాజీ ఎంపీటీసీ మహేశ్వర్‌రెడ్డి చేస్తున్నారు. రాజకీయ కారణాలతో వైసీపీలో వర్గ పోరు కారణంగా నిర్మాణం ఆగిపోయిందని స్థానికులు చెబుతున్నారు. స్థలదాతలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని దాతలు అడ్డుకున్నట్లు తెలుస్తోంది. ఒకవైపు ఆగిన పనులను పూర్తి చేయాలని గిరిజన గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సుండుపల్లె, మడితాడు-1, 2, సొంరంవారిపల్లె, చిన్నగొల్లపల్లె, భాగంపల్లె, జీ.రెడ్డివారిపల్లె సచివాలయం నిర్మాణాలు ప్రారంభమై నిర్మాణ దశలోనే ఆగిపోయాయి. సుండుపల్లె-1 సచివాలయ నిర్మాణం వైసీపీ నాయకుల ప్లాట్ల వ్యాపారం కోసం అగ్రహారం గుట్టలో నిర్మించారని జోరుగా విమర్శలున్నాయి. మండల వ్యాప్తంగా పలు గ్రామపంచాయతీల్లో నిర్మాణాలు పూర్తి చేయకపోవడంతో నిర్మాణాలు పూర్తి కాని గ్రామాల్లో ప్రజలు ప్రభుత్వాన్ని, పాలకులను, ప్రజాప్రతినిధులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆగిపోయిన సచివాలయ నిర్మాణాల కోసం అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మడితాడు-2 సచివాలయం సగం నిర్మాణాలతో ఆగిపోవడంతో చుట్టూ కంపచెట్ల మధ్య మొండి గోడలతో దర్శనమిస్తోంది. ప్రధాన రహదారి పక్కన సగం నిర్మాణాలతో ఆగిపోయిన సచివాలయాన్ని చూసి ప్రజలు నవ్వుతున్నారని అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు బహిరంగంగా వాపోతున్నట్లు తెలుస్తోంది. ఇష్టానుసారంగా కుంటల్లో, చెరువుల్లో సచివాలయ నిర్మాణాలకు ఎలా అనుమతులు ఇచ్చారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాధనం దుర్వినియోగం

- జయరామిరెడ్డి, మాజీ రైతు సంఘం అధ్యక్షుడు



సచివాలయ నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోవడం బాధాకరం. మడితాడు-2 (జీకేరాచపల్లె)లో సచివాలయ నిర్మాణం పూర్తి కాకపోవడంతో నెలకు రూ.4,500 బాడుగ చెల్లించాల్సి వస్తోంది. ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. నిర్మాణం వెంటనే పూర్తి చేసి ప్రభుత్వ సేవలను సచివాలయాల ద్వారా అందించాలి. పనులు ఆగిపోవడంతో చుట్టూ పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి.

ప్లాట్ల కోసమే సచివాలయ నిర్మాణం

- సురేశ్‌నాయుడు, టీడీపీ నాయకుడు



సీఎం సచివాలయ వ్యవస్థను మరిచిపోయారు. మండల కేంద్రంలో సచివాలయ నిర్మాణం చేయకపోవడం హాస్యాస్పదం. వైసీపీ నాయకుల స్వార్థ రాజకీయాలతో అభివృద్ధి కుంటుపడింది. వైసీపీ నాయకుల ప్లాట్ల వ్యాపారం కోసం అగ్రహారం గుట్టలో సచివాలయ నిర్మాణం ప్రారంభించి.. మధ్యలోనే ఆపేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

ఇప్పట్లో నిర్మాణాలు జరగవు

- రామచంద్ర, ఎంపీడీవో, సుండుపల్లె

మండల వ్యాప్తంగా 15 సచివాలయాలు ఉన్నాయి. ఏడు సచివాలయాలు పూర్తి కావడంతో ప్రారంభించాము. మిగిలిన రెండు సచివాలయాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. ఆరు సచివాలయాలు ఇప్పట్లో నిర్మాణాలు జరిగే పరిస్థితి లేదు. కొన్ని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీలో సచివాలయం పనులు సగంలోనే నిలిచిపోయాయి.

'ఆడుదాం ఆంధ్రా'తో క్రీడాకారుల ప్రతిభకు ప్రోత్సాహం

● ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



నియోజకవర్గ స్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

రాయచోటిటౌన్, జనవరి 24: ఆడుదాం ఆంధ్రాతో గ్రామీణ క్రీడాకారుల ప్రతిభకు ప్రోత్సాహం కలుగుతోందని ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. బుధవారం ఆయన రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో రాయచోటి నియోజకవర్గ స్థాయి ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఆడుదాం- ఆంధ్రలో భాగంగా నియోజకవర్గ స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగానే కబడ్డీ విభాగంలో రాయచోటి వర్సెస్ చిన్నమండెం, ఖోఖో విభాగంలో రాయచోటి వర్సెస్ లక్కిరెడ్డిపల్లె, వాలీబాల్ విభాగంలో రాయచోటి వర్సెస్ సంబేపల్లె గర్ల్స్ రాయచోటి వర్సెస్ సంబేపల్లె బాయ్స్ పోటీలను ఎమ్మెల్యే, ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో జిల్లా ఆదర్శంగా నిలిచేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, ఆర్డీవో రంగస్వామి, డ్వామా పీడీ మద్దిలేటి, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఎంపీడీవో మల్‌రెడ్డి, తహసీల్దార్ ప్రేమంత్‌కుమార్, స్పోర్ట్స్ అధికారి చంద్రశేఖర్, ఆడుదాం ఆంధ్ర గేమ్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి నరసరాజు, కబడ్డీ కోచ్ షఫీ, డీఎస్‌డీఓ గౌస్‌బాషా, ఫిజికల్ డైరెక్టర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సలహాదారుల రాజీనామా

రైల్వేకోడూరు, జనవరి 24: బీజేపీ సీనియర్ నాయకుడు, రైల్వేస్టేషన్ అభివృద్ధి సలహాదారులు తోట శ్రీనివాసులు, కంబాల శ్రీనివాసులు, వాకచర్ల సుబ్బారావు తమ పదవులకు బుధవారం రాజీనామా చేశారు. వారి రాజీనామా పత్రాన్ని స్థానిక రైల్వేస్టేషన్ మేనేజర్ ఆర్‌ఎస్‌ఎస్ యాదవ్‌కు సమర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, గుంతకల్లు రైల్వే డివిజన్ అధికారికి తమ రాజీనామాల పత్రాలను పంపామని వారు తెలిపారు.

పెంచలకోనకు మహా పాదయాత్ర

రైల్వేకోడూరు, జనవరి 24: మండలంలోని కె.బుడుగుంటపల్లె పంచాయితీలోని అయ్యవారిపల్లెకు చెందిన నరసింహస్వామి భక్తులు బుధవారం మహాపాదయాత్ర చేపట్టారు. సుమారు 450 మంది 41 రోజులు పాటు దీక్షలు చేపట్టి అనంతరం పాదయాత్రగా వెళ్లారు. రైల్వేకోడూరు నుంచి చిట్వేలి మీదుగా నెల్లూరు రాపూరుకు చేరుకుని అక్కడ నుంచి పెంచలకోన మహాక్షేత్రానికి చేరుకుంటారు.

ఘనంగా బాలికల దినోత్సవం

రైల్వేకోడూరు, జనవరి 24: పట్టణంలోని 2వ వార్డు ప్రభుత్వ స్కూలులో బుధవారం జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పిల్లలకు కాపు నాయకులు మందల నాగేంద్ర, సీహెచ్ రమేష్‌బాబులు స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే జడ్పీ బాలికోన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భుజంగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడతాం

● జయహో బీసీ కార్యక్రమంలో విశ్వనాథనాయుడు



జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న కస్తూరి

ఓబులవారిపల్లె, జనవరి 24: టీడీపీ ప్రభుత్వాన్ని గెలిపిస్తే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడతామని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు అన్నారు. మండలంలోని మంగంపేట చెన్నకేశవ ఆలయ ప్రాంగణంలో మండలంలోని బీసీలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీసీల హక్కులను, వారికి కేటాయించిన రిజర్వేషన్ల విషయాలపై కూలంకుశంగా మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అబ్జర్వర్ హేమాంబరధరరావు, మంగంపేట టీడీపీ నాయకుడు కల్లా చలపతి, గునిపాటి చెన్నరాయుడు, అనుమలగుండం చంద్రమోహన్, ఓబులవారిపల్లె టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు, రాష్ట్ర బీసీ నాయకుడు కమతం నాగరాజు, నియోకవర్గ వ్యాప్తంగా బీసీ నాయకులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి: మండిపల్లి



ఏర్పాట్ల కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, జనవరి 24: పీలేరులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించే రా కదలిరా సభకు కార్యకర్తలు, నాయకులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. బుధవారం సంబేపల్లెలోని టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న స్థలంలో పీలేరు సభకు వచ్చే టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు టిఫెన్, భోజన వసతి కల్పించడం కోసం ఏర్పాటు చేసిన సభాస్థలిని ఆయన పరిశీలించారు. రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు, చక్రాయపేట, కడప, పులివెందుల వైపు నుంచి వచ్చే కార్యకర్తలకు, నాయకులకు భోజన వసతికి ఈ స్థలం ఎంతో అనువుగా ఉంటుందన్నారు. అనంతరం కాటిమాయకుంట మాజీ సర్పంచ్ కొండా భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో 'రా కదలిరా సభ' వాల్ పోస్టర్లను అభిమానులతో కలిసి రాంప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు నాగేశ్వర్‌నాయుడు, గోపాల్, వెంకట్రామిరెడ్డి, కొండా భాస్కర్‌రెడ్డి, యువనాయకులు అంచలరెడ్డి, ఈశ్వర్, రామాంజుల్‌రెడ్డి, టీడీపీ నాయకులు దుద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, పోలు రెడ్డెప్పనాయుడు, పోలు సురేంద్రనాయుడు, సుబ్బరాజుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు ప్రతిఒక్కరికీ అందేలా చూడాలి

రాజంపేట, జనవరి 24: ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో ప్రవేశపెడుతున్న కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగోతు రమేశ్‌నాయుడు తెలిపారు. బుధవారం రాజంపేట మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో వికసిత్ భారత్ సంకల్పయాత్రకు ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ఇళ్లు, బీమా పథకాలు, కార్పొరేట్ వైద్యం, ఆయుష్మాన్ భారత్ వంటి అనేక కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్తుందని, దీన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, బీజేపీ కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేశ్‌నాయుడు, బీజేపీ నేత ఆదినారాయణ, నరేంద్రవర్మ, సునీతవర్మ, వేల్పుల రమణ పాల్గొన్నారు.

ఆడబిడ్డలను స్వేచ్ఛగా ఎదగనిద్దాం : సీడీపీవో

చిట్వేలి, జనవరి 24: ఆడబిడ్డలను స్వేచ్ఛగా ఎదగనిద్దాం.. చదవనిద్దాం, అప్పుడే అద్భుతాలు సృష్టిస్తారని ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు సీడీపీవో రాజేశ్వరి పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవంలో భాగంగా బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన సమావేశం, ర్యాలీ, ప్రతిజ్ఞ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో గ్రేడ్-1 సూపర్‌వైజర్లు వసుంధరమ్మ, విజయకుమారి, విశాలాక్షి, గ్రేడ్-2 సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న డీఈవో శ్రీరామ్‌పురుషోత్తం

రాయచోటిటౌన్, జనవరి 24: జిల్లా ప్రధానోపాధ్యాయ సంఘం డైరీ, హ్యాండ్ బుక్‌ను డీఈఓ శ్రీరామ్‌పురుషోత్తం బుధవారం డీఈవో కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుల కర్తవ్య నిర్వహణలో డైరీతో పాటు హ్యాండ్ బుక్ చాలా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుంకర రామకృష్ణ, డీసీఈబీ సెక్రటరీ కానాల నాగమునిరెడ్డి, మదనపల్లె జనరల్ సెక్రటరీ చెంగల్‌రాయులు, ప్రధానోపాధ్యాయులు శివకుమార్‌రెడ్డి, సుంకర శివయ్య, రెడ్డెన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శిల్పారామం పనుల పరిశీలన

రామాపురం, జనవరి 24: రాయచోటికి కూతవేటు దూరంలోని బండపల్లె గ్రామంలో జాతీయ రహదారి పక్కనే 12 ఎకరాల్లో నిర్మితమవుతున్న శిల్పారామం పనులను బుధవారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. పనుల నాణ్యతపై ఆరా తీసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా శిల్పారామం పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మానస వెంకట్రమణ, మాజీ రెస్కో చైర్మన్ కృష్ణారెడ్డి, కేపీఆర్ కన్‌స్ట్రక్షన్ కనపర్తి చెన్నారెడ్డి, మాజీ సర్పంచ్ రాజారెడ్డి, రవి పాల్గొన్నారు.

సాధికార పోస్టర్ ఆవిష్కరణ

రాజంపేట, జనవరి 24: జనసేన మహిళా సాధికారిత పోస్టర్‌ను జనసేన నియోజకవర్గ నాయకుడు అతికారి దినేశ్ ఆవిష్కరించారు. బుధవారం రాజంపేట జనసేన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా పార్టీ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో చిరంజీవి యువత అధ్యక్షుడు రంజిత్ కుమార్, లీగల్ సెల్ ఉపాధ్యక్షులు కత్తి సుబ్బరాయుడు, శ్రీహరి, హరీష్, రవి, రత్నం, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

స్కూటరిస్ట్‌కు తీవ్ర గాయాలు

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 24: మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ వద్ద స్కూటర్‌ను లారీ ఢీకొనడంతో స్కూటరిస్ట్ వడ్డి హరిక్రిష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. రాఘవరాజుపురం హరిజనవాడకు చెందిన హరిక్రిష్ణ మంగంపేటలోని ఓ ప్రైవేట్ కంపెనీలో సూపర్వైజర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం తన వాహనంపై విధులకు వెళ్తుండగా, కర్ణాటకకు చెందిన లారీ ఢీకొనడంతో గాయాలయ్యాయి. స్థానికులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి మల్లికార్జునరెడ్డి

రైల్వేకోడూరు, జనవరి24: జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం విజయవంతం చేయాలని రైల్వేకోడూరు ఎన్నికల అధికారి వి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం ప్రతి బూత్ లెవల్‌లో నిర్వహించాలని బీఎల్‌వోలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కొత్తగా వచ్చిన ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులుంటే అధికారుల దృష్టికి తేవాలన్నారు. అనంతరం రైల్వేకోడూరు, చిట్వేలి, పుల్లంపేట, ఓబులవారిపల్లె, పెనగలూరు మండలాల తహసీల్దార్లు, రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

బీద రవిచంద్రయాదవ్‌ను కలిసిన విశ్వబ్రాహ్మణ నాయకులు



రవిచంద్రయాదవ్‌ను కలిసిన సంఘం నేతలు

రాయచోటిటౌన్, జనవరి24: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విశ్వబ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించే విధంగా టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని టీడీపీ రీజనల్ కోఆర్డినేటర్ బీద రవిచంద్రయాదవ్‌ను ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కోరారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పొలిటికల్ సమన్వయ కమిటీ సభ్యుడు నరసింహాచారి ఆధ్వర్యంలో నెల్లూరులోని ఆయన నివాసంలో ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, విశ్వబ్రాహ్మణుల సంఘం నాయకుడు విశ్వంఆచారి, బొల్లాపల్లి సిద్దు, నరసింహాచారిలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ కులాలను రాజకీయ రంగాల్లో రాణించేందుకు ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు.


బాల్య వివాహాలు నేరం

సుండుపల్లె, జనవరి 24: బాల్యవివాహాలు నేరమని, ఆడబిడ్డను చదివిస్తే ఆ చదువు ఆ ఇంటికి వెలుగు అవుతుందని ప్రధానోపాధ్యాయుడు జయన్న తెలిపారు. బుధవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా బాలికల దినోత్సవం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

రూ.10 వేల ఆర్థిక సాయం

వీరబల్లి, జనవరి 24: మండల పరిధిలోని ఓదివీడుకు చెందిన దివ్యాంగుడు రమణయ్యకు జనసేన పార్టీ రాజంపేట ఇన్‌చార్జి మలిశెట్టి వెంకట్రమణ ఆధ్వర్యంలో బుధవారం రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. గత కొన్నేళ్లుగా ఈయన అనారోగ్యంతో బాధపడుతుండడంతో మండల నాయకులు జయరామయ్య మలిశెట్టి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సాంబయ్య, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఇరువురు విద్యార్థులు



ఆఫ్రిన్, ఆర్షియాలు

నందలూరు, జనవరి 24: బెంగుళూరులో జరిగిన జాతీయ స్థాయి స్టూడెంట్స్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ ఫైనల్స్‌కు గొబ్బిళ్ల అక్షర స్కూల్ విద్యార్థులు ఆఫ్రిన్, ఆర్షియాలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంటు శ్రీనాథ్, శ్రీనాధ్ మంగళవారం మాట్లాడుతూ ప్రతిఏటా జాతీయ స్థాయిలో నిర్వహించే స్టూడెంట్స్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ మొదటి దశలో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వేల మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చారని, రెండవ దశకు ఇరవై టీమ్స్‌ను ఎంపిక చేయగా అందులో తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు.

కార్యదర్శులకు, వీఆర్వోలకు శిక్షణ

పుల్లంపేట, జనవరి 24: పేదలందరికీ ఇళ్లు అనే కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల ఇళ్లను సచివాలయాల్లో రిజిష్టరు చేసేందుకు సచివాలయంలో పనిచేసే పంచాయతీ కార్యదర్శులకు, వీఆర్వోలకు బుధవారం శిక్షణ ఇచ్చారు. స్థానిక సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ అజీజుల్లా ఆధ్వర్యంలో సీనియర్ అసిస్టెంట్ సుబ్బనరసయ్య ఈ శిక్షణ ఇచ్చారు. రిజిస్ట్రేషన్లు ఎలా చేయాలి, డాక్యుమెంటేషన్ తదితర వాటి గురించి శిక్షణ ఇచ్చామన్నారు.

కులగణనకు సర్వర్ డౌన్


చిన్నకలిగిరిలో రాత్రి 9 గంటలకు కూడా సర్వేలో సచివాలయ సిబ్బంది

పెనుమూరు, జనవరి 24: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జగన్ సర్కార్ కులగణనకు శ్రీకారం చుట్టింది. ఈ సర్వేలో వలంటీర్లను కీలకం చేస్తూ వారితో సచివాలయ ఉద్యోగులను జత చేసింది. ఆయా కుటుంబాల వివరాలను కులగణన యాప్‌లో పొందుపరిచి ఇంట్లో వారిచేత వేలిముద్రలు వేయిస్తున్నారు. 28వ తేదిలోపు ఈ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. అయితే ఈ సర్వే చేయడానికి సర్వర్ మొరాయించడంతో సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఉదయం 6 గంటలకు వచ్చి రాత్రి 10 వరకు చేస్తున్నారు. పగలు సర్వర్ పనిచేయకపోవడంతో రాత్రిపూట చేయాల్సి వస్తుందని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. రాత్రిళ్లు ఇళ్ల వద్దకు వెళ్లడానికి కొందరు ఇబ్బంది పడుతున్నారు. అయినా సర్వే పూర్తి చేయాలని తప్పక వెళుతున్నారు. పెనుమూరు మండలంలో 13769 ఇళ్లకు గాను ఆరు రోజుల్లో 47 శాతం సర్వే జరిగింది.

ముందస్తుగా పీసీసీ అధ్యక్షురాలి పర్యటన

● 28న తిరుపతిలోనే ఉమ్మడి జిల్లా శ్రేణులతో సమావేశం

వెదురుకుప్పం, జనవరి 24: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జిల్లా పర్యటన ముందుకు మారినట్లు డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ బుధవారం తెలిపారు. ముందుగా ఈనెల 29వ తేది మధ్యాహ్నం 12 గంటలకు చిత్తూరులో సమావేశం ఉంటుందని ఖరారైందన్నారు. కానీ, మారిన షెడ్యూల్ మేరకు 28వ తేది ఉదయం 10 నుంచి 12 గంటల వరకు తిరుపతిలోనే ఉమ్మడి జిల్లా (చిత్తూరు, తిరుపతి జిల్లాల) కాంగ్రెస్ పార్టీ కేడర్‌తో వైఎస్ షర్మిల సమావేశమవుతారని చెప్పారు. ఈ మార్పును జిల్లాలోని పార్టీ శ్రేణులు గుర్తించి.. సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎన్నికల నిర్వహణ కమిటీలను నేటిలోగా ఏర్పాటు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 24:సార్వత్రిక ఎన్నికల నిర్వహణకోసం ఎన్నికల కమిటీల ఏర్పాటును గురువారంలోగా పూర్తిచేయాలని కలెక్టర్ షన్మోహన్ సూచించారు. బుధవారం ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంసీసీ కమిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్ కమిటీ, సర్వైలెన్స్ కమిటీ వీడియో వ్యూవింగ్ వంటి కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు మండల, మున్సిపాలిటీల వారీగా కమిటీలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లు డిప్యూటీ తహసీల్దార్ లేదా సీనియర్ ఆర్ఐ, ఏఎస్ఐ, వీడియో గ్రాఫర్, ఆర్మ్‌డ్ ఫోర్స్‌తో కూడిన సిబ్బందిని నియమించాలన్నారు. జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, డీఈవో విజయేంద్రరావు, సర్వశిక్షా అభియాన్ ఆర్వో వెంకటరమణ, డీఎల్డీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చిత్తూరులో జాతీయ ఓటర్ల దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 24: చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో గురువారం ఉదయం పది గంటలకు జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటలకు గాంధీ విగ్రహం సర్కిల్ వద్ద విద్యార్థులచే మానవహారం, పురవీధుల్లో ర్యాలీ కొనసాగుతుంది. అనంతరం నాగయ్య కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ షన్మోహన్, ఇతర ముఖ్య అతిథుల ప్రసంగాలు, ప్రతిజ్ఞ, సీనియర్ సిటిజన్ల సన్మానం, కొత్తగా ఓటర్లుగా నమోదైన యువ ఓటర్లకు ఎపిక్ కార్డుల పంపిణీ జరుగుతాయి. ఎన్నికల విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఈఆర్వో, ఏఈఆర్వో, సూపర్‌వైజర్లు, బీఎల్వోలు, ఆపరేటర్లకు అవార్డుల ప్రదానం ఉంటుందని ఆర్డీవో జి.చిన్నయ్య తెలిపారు.

సచివాలయాల్లో వైసీపీ నేతల మీటింగులు

సిబ్బందికి, వలంటీర్లకు ఎన్నికల్లో ఎలా పనిచేయాలో పాఠాలు

ఏర్పేడు, జనవరి 24: సచివాలయాలను వైసీపీ నాయకులు పార్టీ ప్రచార కేంద్రాలుగా వాడుకుంటున్న వైనం తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలో బుధవారం బయటపడింది. మండలంలో 19సచివాలయ కేంద్రాలుండగా వాటిలో 13కేంద్రాల్లో అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు బుధవారం సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు వచ్చే ఎన్నికల్లో చేయాల్సిన పనుల గురించి సూచనలిచ్చారు.ఈ విషయాన్ని ఈవో పీఆర్డీ చెప్పినట్లుగా ముందురోజే ఓ పంచాయతీ అధికారి సచివాలయ డీడీవోలకు, వలంటీర్లకు వాయిస్ మెసేజ్ పంపాడు. అంతే కాకుండా ఏ సచివాలయానికి ఎంత సమయానికి వైసీపీ నాయకులు వస్తారో కూడా తెలియపరిచాడు.ఆ సమయానికి వలంటీర్లతో సచివాలయ సిబ్బంది సిద్ధంగా ఉండాలని వాయిస్ మెసేజ్‌లో సూచించారు. అదే ప్రకారం బుధవారం వైసీపీ నాయకులు 13 సచివాలయాల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఎన్నికల్లో పనిచేయాల్సిన తీరును, ప్రజలకు చెప్పాల్సిన అంశాలను వివరించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తమ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఒక దగ్గర ఉంచాలని ఆదేశించి మరీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.వచ్చే ఎన్నికల్లో వైసీపీకోసం పనిచేయకపోతే ఉద్యోగాలుండవని చెప్పినట్లు సమాచారం. ఈ ప్రచార కార్యక్రమాలను పార్టీ కార్యాలయాల్లో నిర్వహిస్తే బాగుంటుందని ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది వైసీపీ నాయకులకు సూచించినట్లు తెలిసింది.

ఈ నిజం మీకు తెలుసా?

వన్నెకుల క్షత్రియులకు చంద్రబాబు చేసిన మేలుపై పోస్టర్లు ● ఎట్టకేలకు శిలాఫలకంపై చేరిన పేరు


చిన్నకురబలపల్లెలో పోస్టర్లతో ఊరేగింపు - చంద్రబాబు, కంచర్ల పేర్లు చేర్చి రూపొందించి శిలాఫలకం

కుప్పం, జనవరి 24: వన్నెకుల క్షత్రియులకు టీడీపీ చేసిందేమీలేదని వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని అడ్డుకోవడానికి ఆ పార్టీ శ్రేణులు నడుం బిగించాయి. ప్రత్యేకించి వన్నెకుల క్షత్రియ కళ్యాణ మండపం పేరుతో మంత్రి పెద్దిరెడ్డి బుధవారం ప్రారంభించిన భవనం విషయంలో 'ఈ నిజం మీకు తెలుసా?' పేరుతో వాస్తవాలను వెల్లడించే పోస్టర్లను నేతలు రూపొందించారు. వన్నెకుల క్షత్రియ భవనానికి రూ.5 కోట్ల విలువైన భూమితోపాటు, రూ.2 కోట్ల కేటాయింపు చంద్రబాబే చేశారని అందులో పేర్కొన్నారు. భవన నిర్మాణం టీడీపీ హయాంలోనే 90 శాతం పూర్తయిందని, వైసీపీ అధికారంలోకి వచ్చాక పట్టించుకోకుంటే మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయాలని టీడీపీ ధర్నా చేసిందని గుర్తు చేశారు. భవిష్యత్తులో హాస్టల్‌తో పాటు వన్నెకుల క్షత్రియుల అభివృద్ధికి కృషి చేసేది చంద్రబాబేనని పోస్టర్‌లో ముద్రించారు. 'మన కుల దైవం ధర్మరాజు సాక్షిగా ఇదే నిజం. అందుకే, లక్ష మెజారిటీతో చంద్రబాబు గారిని గెలిపించి మన రుణం తీర్చుకుందాం' అని ముక్తాయించారు. ఈ పోస్టర్లను కుప్పం మున్సిపాలిటీ లక్ష్మీపురంతోపాటు గ్రామగ్రామానా గోడలకు అంటించారు. చిన్నకురబలపల్లె తదితర గ్రామాలు, శాంతిపురం మండలం వడ్డిమానికొత్తూరు, సి.బండపల్లె తదితర గ్రామాలలో ఊరేగించారు. పోస్టర్లకు పాలాభిషేకాలు చేశారు. ఆ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు, నాయకులు పార్టీ కార్యకర్తలు చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. మరోవైపు ప్రారంభోత్సవ శిలాఫలకంపై తొలుత స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు పేరుతోపాటు తూర్పు రాయలసీమ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ లేకపోవడంపై టీడీపీ శ్రేణులు ఫిర్యాదు చేయగా.. ప్రొటోకాల్ ప్రకారం ఆ పేర్లు చేర్చారు.

వైసీపీని సాగనంపడమే బీసీల లక్ష్యం

● చిత్తూరులోని 'జయహో బీసీ' సదస్సులో నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న సీఆర్ రాజన్

చిత్తూరు సిటీ, జనవరి 24: వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడమే లక్ష్యమని బీసీ నేతలు చెప్పారు. చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో బుధవారం 'జయహో బీసీ' సదస్సు జరిగింది. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఆర్ రాజన్ మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక 26 మందికిపైగా బీసీలు హత్యకు గురయ్యారని, 650 మంది టీడీపీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టారన్నారు. బీసీ సబ్ ప్లాన్ నిధుల నుంచి సుమారు రూ.34 వేల కోట్లు మళ్ళించారని ఆరోపించారు. బీసీలు, మైనార్టీలకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములను స్థానిక వైసీపీ నేతలు దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారని చెప్పారు. బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించలేదని విమర్శించారు. మాజీ మేయర్, నగర పార్టీ అధ్యక్షురాలు కటారి హేమలత మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో బీసీలకు స్వయం ఉపాధి రుణాలు, చేతి వృత్తులవారికి ఆదరణ పథకం కింద 90 శాతం రాయితీపై పరికరాలు అందించిందని గుర్తుచేశారు. బీసీలకు ఇచ్చిన నామినేటెడ్ పదవులు కేవలం అలంకారప్రాయంగానే ఉన్నాయన్నారు. బీసీ కార్పొరేషన్‌కు రూపాయి కూడా ప్రభుత్వం కేటాయించలేదని విమర్శించారు. బీసీలు బలహీనులు కాదని, వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు సురేంద్రకుమార్, కాజూరు బాలాజి, గురజాల జగన్మోహన్, బీసీ సంఘం నేతలు వెంకటేష్ యాదవ్, త్యాగరాజన్, షణ్ముగ రెడ్డి, సీఎం విజయ, ఈశ్వర్, శంకర్, రఘు, సుబ్రి, నిత్యానందం, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంపై రాళ్లదాడి

● నలుగురు దుండగులు, మోటారు సైకిళ్లు పోలీసులకు అప్పగింత



పోలీసు స్టేషన్‌లో ఉన్న దుండగుల ద్విచక్ర వాహనాలు - పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు, ఎన్ఎస్‌పేట వాసులు

పుంగనూరు, జనవరి 24: పుంగనూరు ఎస్ఎస్‌పేట రాంనగర్ ఆంజనేయస్వామి ఆలయంపై మంగళవారం రాత్రి కొందరు రాళ్లు విసిరారు. ఇటీవల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, జెండాలు చింపడంతో ఉద్రిక్తత నెలకొంది. దుండగులు రాళ్లు విసురుతున్న విషయం తెలుసుకుని స్థానికులు రావడంతో పలువురు పారిపోగా, నాలుగు ద్విచక్రవాహనాలు, నలుగురిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు బుధవారం పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి ధర్నా చేశారు. బీజేపీ కోఆర్డినేటర్ పూల ప్రేమ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ.. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో 50 మందికిపైగా ఆలయం వద్దకు వచ్చి ఫ్లెక్సీలు చింపి, రాళ్లు విసరడం దారుణమన్నారు. పట్టుబడిన ముబారక్‌ను విచారించగా తానే అందరినీ పిలిపించినట్లు చెప్పారని, రోషన్, జియాల్, మహ్మద్, లడ్డూ తదితరులు వచ్చామని చెప్పారన్నారు. వారి వాహనాల్లో కత్తి, రాళ్లు, గంజాయి, మద్యం సీసాలు, పెట్రోల్, మారణాయుధాలు ఉన్నట్లు తెలిపారు. వీరు కోలార్, రామసముద్రం, స్థానిక బీడీకాలనీ, ఉబేదుల్లా కాంపౌండ్ ప్రాంతాల నుంచి వచ్చినట్లు తెలిపారన్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల ఏటిగడ్డపాళ్యంలోని దేవాలయంపై దాడుల ఘటనలో పోలీసులు కఠినంగా వ్యవహరించకపోవడంతో ప్రస్తుతం ఎస్ఎస్‌పేటలో ఈ ఘటన జరిగిందన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించాలని డిమాండు చేశారు. ధర్నా విషయం తెలుసుకున్న సీఐ రాఘవరెడ్డి ఆందోళనకారుల వద్దకు చేరుకుని జరిగిన విషయంపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతో ఆలయ కమిటీ సభ్యుడు వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీజేపీ నాయకులు ప్రేమ్‌కుమార్, నానబాల కుమార్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

పదవులు అమ్ముకునే రోజాకు మంత్రిగా కొనసాగే అర్హత లేదు

● మాజీ ఎమ్మెల్సీ దొరబాబు విమర్శ

చిత్తూరు సిటీ, జనవరి 24: పదవులను అమ్ముకుంటున్న మంత్రి రోజాకు పదవిలో కొనసాగే అర్హత లేదని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు విమర్శించారు. చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యక్రమంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సొంత పార్టీ నాయకులకే రోజా పదవులు అమ్ముకోవడం దారుణమన్నారు. పుత్తూరు కౌన్సిలర్ భువనేశ్వరి మున్సిపల్ ఛైర్మన్ పదవికోసం తనవద్ద రూ.70 లక్షలు డిమాండ్ చేసి రూ.40 లక్షలు తీసుకున్నారని బహిరంగంగా చెప్పడమే వైసీపీ నేతల దోపిడీకి నిదర్శనమన్నారు. దళితులను వైసీపీ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. దళితులకు పదవులు కావాలంటే రోజాకు కప్పం కట్టాలా అని ప్రశ్నించారు. దళిత ద్రోహి సీఎం జగన్ అనడానికి ఇంతకంటే నిదర్శనం వేరొకటి లేదన్నారు. రోజా దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ తక్షణమే రోజాను బర్తరఫ్ చేయాలని డిమాండు చేశారు. ఈ సమావేశంలో నేతలు సురేంద్ర కుమార్, కటారి హేమలత, మోహన్‌రాజ్, రాణి, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో ఒక వర్గం రోజా ప్రతిష్టను దిగజారుస్తోంది

● పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ హరి

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 24: నగరి నియోజకవర్గ వైసీపీలో ఒక వర్గం పనిగట్టుకుని మంత్రి రోజా ప్రతిష్టను దిగజారుస్తోందని పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ హరి తెలిపారు.వైస్ ఛైర్మన్ శంకర్,కొందరు కౌన్సిలర్లతో కలిసి తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రోజా రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక చేస్తున్న దుష్ప్రచారంలో భాగంగానే కౌన్సిలరు భువనేశ్వరి ఆరోపణలు చేసిందన్నారు. సత్య అనే వ్యక్తి అప్పు తీసుకుంటే మంత్రికి ఏమి సంబంధమని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఒక వర్గం చేస్తున్న కుట్రే ఇది అన్నారు. ఆ వర్గం పేర్లు చెప్పాలని విలేకరులు అడగ్గా నీళ్లు నమిలారు.కౌన్సిలరు భువనేశ్వరి వద్ద డబ్బు తీసుకున్న సత్య మాట్లాడుతూ తాను వ్యాపార లావాదేవీల్లో భాగంగా రూ.29లక్షలు తీసుకున్నానని, ఇప్పటికే రూ.16లక్షలు చెల్లించానని, మిగిలిన బాకీ చెల్లించేలోపు మంత్రిపై అభాండాలు మోపారని తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థిత్వాలకు దరఖాస్తు

చిత్తూరు రూరల్/వెదురుకుప్పం/జీడీనెల్లూరు, జనవరి 24: చిత్తూరు, గంగాధరనెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ అభ్యర్థిత్వాల కోసం ముగ్గురు దరఖాస్తు చేశారు. చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని టిక్కీ రాయల్ కోరారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ మాణిక్యం ఠాగూర్‌ను కలిసి దరఖాస్తు అందజేశారు. అలాగే, జీడీనెల్లూరు అభ్యర్థిత్వం కోరం జీడీనెల్లూరు మండలం నెల్లేపల్లికి చెందిన బి.రామస్వామి కుమారుడు బి.దొరస్వామి బుధవారం విజయవాడలో రాష్ట్ర వ్యవహారాల కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్‌కి దరఖాస్తు ఇచ్చారు. అనంతరం కేవీపీ రామచంద్రరావును కలసినట్లు ఆయన తెలిపారు. అలాగే, బాలకృష్ణాపురం దళితవాడకు చెందిన లాయర్ మణికృష్ణ కూడా జీడీనెల్లూరు నియోజకవర్గ అభ్యర్థిత్వం కోసం మాణిక్యం ఠాగూర్‌కు బయోడేటా అందజేశారు.

బీసీవై పార్టీకి చెరకు రైతు గుర్తు కేటాయింపు

పుంగనూరు, జనవరి 24: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో భారత చైతన్య యువజన పార్టీకి కామన్‌గా చెరకురైతు గుర్తును కేటాయిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆ పార్టీ అధ్యక్షుడు బి.రామచంద్రయాదవ్ బుధవారం రాత్రి తెలిపారు. ఈ ఎన్నికలకు బీసీవై పార్టీ పూర్తిగా సిద్ధమైందని, సంస్థాగత నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నట్లు వివరించారు. ఈనెల 31వ తేది మంగళగిరిలోని కేంద్ర పార్టీ కార్యాలయంలో నియోజకవర్గాల కమిటీలు ప్రకటిస్తామని చెప్పారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను గుర్తించండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 24: జర్నలిస్టులకు ఇళ్ల పట్టాల మంజూరు కోసం అనువైన స్థలాన్ని గుర్తించాలని, ఇందుకు రెవెన్యూ అధికారులు, మీడియా సభ్యులు సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జర్నలిస్టుల ఇళ్ల పట్టాల కమిటీ సమావేశం జరిగింది. ఇళ్ల స్థలాలకు 311 మందిని అర్హులుగా గుర్తించినట్లు చెప్పారు. రెవెన్యూ శాఖ ద్వారా త్వరితగతిన భూస్థలాల పరిశీలన ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. అవసరమైన భూములను చిత్తూరు, నగరి, పలమనేరు, కుప్పం, వి.కోట, చౌడేపల్లె, పుంగనూరు మండలాల రెవెన్యూ అధికారులతో కమిటీ, ప్రెస్‌క్లబ్ సభ్యులు సమన్వయం చేసుకుని ఎఫ్ఎంబీలను తయారుచేయాలని చెప్పారు. డీఆర్వో రాజశేఖర్, సర్వేశాఖ అధికారి గౌస్ బాషా, ఆర్డీవో చిన్నయ్య, కమిటీ సభ్యులు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఎం కారులో ఇరుక్కుని తిరుపతి కలెక్టర్ ప్రయాణం



తిరుపతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు సమీపంలోని తాజ్ హోటల్‌లో ఇండియా టుడే మీడియా సంస్థ నిర్వహించిన ఎడ్యుకేషన్ సమ్మిట్-2024 కార్యక్రమానికి సీఎం జగన్ ముఖ్య అతిథిగా బుధవారం హాజరయ్యారు. రేణిగుంటలోని విమానాశ్రయం నుంచీ తిరుపతిలోని తాజ్ హోటల్‌కు జగన్ వచ్చేటపుడు, తిరిగి వెళ్ళేటపుడు కలెక్టర్ వెంకట్రమణారెడ్డి సీఎం కారులోనే ఇరుక్కుని కూర్చుని ప్రయాణించడం కనిపించింది. ముందు సీట్లో సీఎం కూర్చుని ఉండగా, వెనుక సీటులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, సెక్యూరిటీ ఆఫీసర్ కూర్చున్నారు. కలెక్టర్ కూడా ప్రయాణించడంతో వెనుక సీట్లో ఇరుకైంది. దీంతో ఆయన టీటీడీ ఛైర్మన్, మంత్రి పెద్దిరెడ్డి ఒళ్ళో కూర్చున్న చందంగా ఇరుక్కుని ప్రయాణించడం కనిపించింది. సీఎం కాన్వాయ్‌లో పలు వాహనాలు అందుబాటులో వుండడంతో పాటు కలెక్టర్‌కు సొంత వాహనం కూడా వున్నప్పటికీ సీఎం కారులో అంతగా ఇరుక్కుని వెళ్ళాల్సిన అవసరమేమిటన్న ప్రశ్న ఎదురవుతోంది. కాన్వాయ్‌లో ఈ దృశ్యం చూసిన వారంతా దీనిపైనే చర్చించుకోవడం కనిపించింది. అయితే తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో చోటుచేసుకున్న అక్రమాలపై కేంద్ర ఎన్నికల సంఘం కన్నెర్ర చేయడం, పలువురు అధికారులపై ఇప్పటికే చర్యలు తీసుకున్న నేపథ్యంలో ప్రధానంగా ఆ అంశంపై సీఎం కారులో చర్చ జరిగివుంటుందన్న ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.

'సిద్ధం!' అంటూ ఫ్లెక్సీలు పెట్టి

ఇంత భయమెందుకు?

● సీఎంను అడ్డుకుంటామని చెప్పకున్నా మమ్మల్ని గడపదాటనివ్వరా?

● టీడీపీ, జనసేన నేతల మండిపాటు


ఇంటిముందున్న పోలీసులతో సుగుణమ్మ వాగ్వాదం

తిరుపతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ తిరుపతి పర్యటనను అడ్డుకుంటామని ప్రతిపక్ష పార్టీలేవీ ప్రకటించకపోయినా నాయకులను గృహనిర్బంధంలో వుంచడం విమర్శలపాలైంది. బుధవారం తెల్లవారకముందే టీడీపీ, జనసేన నాయకుల ఇళ్లముందు పోలీసులు ప్రత్యక్షమయ్యారు. గడపదాటనీయకుండా కాపలాకాశారు. మీడియా సమావేశాలకు వెళ్లాలని మొత్తుకున్నా ఎస్కార్ట్‌లాగా వెంబడించారు. సాయంత్రం 4 గంటలపైన సీఎం పర్యటన ఉంటే ఉదయం 6 గంటలనుంచే ప్రతిపక్ష నాయకులను హౌస్ అరెస్టు చేశారు. తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణతో పాటు జనసేన నాయకులు కిరణ్ రాయల్, రాజా రెడ్డిలను గృహనిర్బంధం చేశారు. సాయంత్రం 6 గంటలపైన సీఎం వెళ్లిపోయాకే విడిచిపెట్టారు.ఈ సందర్భంగా సుగుణమ్మ,ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ జగన్ రెడ్డిని అడ్డుకుంటామని తాము చెప్పనప్పుడు ప్రివెంటివ్ అరెస్టులు ఎందుకు చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. తిరుపతిలో ప్రతిపక్షమే లేదని భూమన అభినయ్ రెడ్డి, ఇతర వైసీపీ నేతలు ప్రగల్భాలు పలుకుతుంటే తమ నాయకుల ఇళ్ల వద్దకు పోలీసులను ఎందుకు పంపారో అర్థం కావడంలేదన్నారు. వైసీపీ దుర్మార్గపు పాలనకు ఇదొక నిదర్శనమని మండిపడ్డారు.

● 'సిద్ధం.!' అంటూ ఫ్లెక్సీలు పెట్టి...

ఎన్నికల యుద్ధానికి 'సిద్ధం' అన్నట్టుగా జగన్మోహన్ రెడ్డి ఫొటోలతో పెద్దపెద్ద ఫ్లెక్సీలు రాత్రికి రాత్రే తిరుపతి నగరమంతా పెట్టేశారు. ఫ్లెక్సీల్లో మాత్రం సిద్ధం.! అంటూ సవాల్ విసిరి, ప్రతిపక్షాలను గడపదాటనీయకుండా అడ్డుకున్నారు. 'ఆయనేమో సిద్ధం అంటూ వేలు చూపిస్తున్నాడు. మీరేమో మమ్మల్ని బయటకు రావొద్దు అంటున్నారు' అంటూ సుగుణమ్మ పోలీసులనుద్దేశించి చమత్కరించారు.

గ్రానైట్ లారీని ఢీకొన్న బైకు

● ఇద్దరు యువకుల దుర్మరణం



రోడ్డు పక్కన పడున్న మృతదేహాలు

పెనుమూరు, జనవరి 24: గ్రానైట్ లోడ్‌తో వెళుతున్న లారీని ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఈ ఘటన పెనుమూరు మండలంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఎన్టీఆర్ జలాశయం సమీపంలో మఠంపల్లి వద్ద చిత్తూరుకు గ్రానైట్ లోడ్‌తో లారీ వెళుతుండగా ఎదురుగా ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తూ ఢీకొట్టారు. దీంతో ఆ ఇద్దరూ 30 అడుగుల దూరంలో ఎగిరి పడటంతో తలకు బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని విచారించగా, ఆ ఇద్దరూ గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేసే బిహారుకు చెందిన కూలీలుగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి


విజయ్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

పుంగనూరు రూరల్, జనవరి24: పుంగనూరు-చిత్తూరు మార్గంలోని తోపు మఠం వద్ద ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో విద్యార్థి మృతి చెందాడు. తోపుమఠానికి చెందిన మునెప్ప కుమారుడు విజయ్‌కుమార్ గూడూరుపల్లె ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం తండ్రి మునెప్పతో కలసి ద్విచక్రవాహనంలో వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొనడంతో విద్యార్థి తలకు బలమైన గాయాలు తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. సీఐ రాఘవరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదంపై ఆరా తీసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అత్త, వదినపై కత్తితో దాడి



అత్త హురాన్, వదిన సల్మా

చిత్తూరు, జనవరి 24: చిత్తూరు నగరం శంకరయ్యగుంటలో బుధవారం రాత్రి జరిగిన దాడిలో హురాన్, సల్మా గాయపడ్డారు. టూటౌన్ సీఐ ఉలసప్ప తెలిపిన ప్రకారం.. నూర్ అనే వ్యక్తి ఓ చికెన్ షాపులో పని చేస్తూ తన భార్య హసీనాతో కలిసి శంకరయ్యగుంటలో నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి తనను భర్త కొడుతున్నాడంటూ హసీనా తన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో హసీనా తల్లి, ఆమె పెద్ద కుమార్తె సల్మా వెళ్లి ఇద్దరిని విడిపించే ప్రయత్నం చేశారు. తన కుటుంబంలో గొడవ జరుగుతుంటే ఎందుకు అడ్డు వస్తున్నారంటూ ఆగ్రహించిన నూర్ కత్తి తీసుకుని అత్త, వదినపై దాడికి పాల్పడ్డాడు. వారిద్దరి గొంతు వద్ద తెగడంతో స్థానికులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరు కోలుకుంటుండగా... సల్మా హోంగార్డుగా పనిచేస్తున్నారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తాపడి ఆశ వర్కర్..


మృతిచెందిన జయమ్మ

పుంగనూరు రూరల్, జనవరి24: పుంగనూరు మండలం సుగాలిమిట్ట క్రాస్‌లో ఆటో బోల్తాపడటంతో నేతిగుట్లపల్లె ఆశ వర్కరు జయమ్మ బుధవారం మృతిచెందారు. నేతిగుట్లపల్లెకు చెందిన ఆటో యజమాని బాబు, అతడి భార్య, ఆశ వర్కరు అయిన జయమ్మ కలసి మంగళవారం మండలంలోని వనమలదిన్నెలో బంధువుల ఇంటికి సంక్రాంతి పండుగకు వెళ్లారు. తిరిగి రాత్రి సొంత ఆటోలో స్వగ్రామానికి వెళుతుండగా సుగాలిమిట్ట క్రాస్ పత్రపల్లె రోడ్డువద్ద ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో జయమ్మ తీవ్రంగా గాయపడగా, బాబుకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి ఆమెను తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఆమె మృతి చెందగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కురబలకోట: మిట్స్‌లో మాట్లాడుతున్న ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ విజయలక్ష్మి


వాల్మీకిపురంలో బాలికలనుద్దేశించి మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారిణి రోహిణి


తంబళ్లపల్లె: బాలికకు బహుమతి అందచేస్తున్న సీడీపీవో నాగవేణి


కలికిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, విద్యార్థినులు

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

తంబళ్లపల్లె, జనవరి 24: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని సీడీపీవో నాగవేణి అన్నారు. బుధవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు హక్కులు, బాధ్యతలు, బాల్య వివాహాలతో అనర్థాలను వివరించారు. ఆడపిల్లలు ఉన్నత చదువులు చదివితేనే హక్కులు, సమానత్వం సాధ్యమవుతుందన్నారు. ఆడపిల్లల్లో హక్కులపై చైతన్యం కల్పించడం, బాలికా విద్య ప్రాముఖ్యత, వారి ఆరోగ్యం, పోషణపై అవగాహన పెంచడం జాతీయ బాలికల దినోత్సవ లక్ష్యాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరచిన బాలికలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

ఉన్నత స్థితికి చేరుకోవాలి..

వాల్మీకిపురం: నేటి సమాజంలో ప్రతి బాలిక కూడా తప్పనిసరిగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ రోహిణి సూచించారు. బుధవారం స్థానిక అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బాలికల సాధికారత, హక్కుల పై అవగాహన కల్పించారు. చెడు మార్గాలకు దూరంగా ఉంటూ క్రమ శిక్షణతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తద్వారా జరిగే పరిణామాలను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కల్పన మహిళా ఉపాధ్యాయులు ధనలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణకు నడుం బిగించాలి

కురబలకోట: బాలికల సంరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని బాలికల ఇంటర్నేషనల్ రిలేషన్ సీనియర్ మేనేజర్ విజయలక్ష్మి పిలుపు నిచ్చారు. మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. అసమానతలను దూరం చేసేలా ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. బాలికలకలకు ఉండే హక్కులను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు కల్పన, గీత తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన అవసరం

కలికిరి: బాల్య వివాహాల కారణంగా తలెత్తే అనర్థాలపై బాలికలు అవగాహన పెంచుకోవాలని వాల్మీకిపురం సీడీపీవో భారతి సూచించారు. బాలికలు చదువులపై దృష్టి సారించాలని కోరారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. సమావేశం అనంతరం ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజరు అరుంధతి, అంగన్‌వాడీ కార్యకర్తలు అమ్మాజీ, ప్రసన్నకుమారి, హెచ్‌ఎం జయమ్మ, ఉపాధ్యాయినులుపాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో మండల విద్యాశాఖాధికారి నారాయణ మాట్లాడుతూ ఆడ పిల్లలను ఎదగనిద్దాం - ఆడ పిల్లలను చదవనిద్దాం అని పిలుపునిచ్చారు. ఆడపిల్లలకు అన్ని రంగాల్లో అవకాశం కల్పించాలని కోరారు. వారు చదివితేనే దేశానికి మంచిదన్నారు. ఆడపిల్లలను అమితంగా ప్రేమించాల్సిన బాధ్యత తల్లిదండ్రుల మీద ఉందన్నారు. కుటుంబ బాధ్యత, పిల్లల ఆరోగ్య సంరక్షణ, ఆడ పిల్లలకు ఉంటుందన్నారు. సమాజంలో లింగ వివక్ష చూపకూడదన్నారు. బాల్యవివాహాలు నేరమన్నారు. ఆడ పిల్లల సంక్షేమానికి ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు చేశాయన్నారు. మహిళలకు రిజర్వేషన్‌లు కల్పించిందన్నారు. బాలికల సంక్షేమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ జయరాణి, నాగరత్న, కస్తూరిబా పాఠశాల ప్రినిపాల్, సిబ్బందితదితరులు పాల్గొన్నారు.


పెద్దతిప్పసముద్రం: మాట్లాడుతున్న మండల విద్యాశాఖాధికారి నారాయణ

చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య

కురబలకోట, జనవరి 24: కుటుంబ కలహాల కారణంగా ఓ వివాహిత చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ముదివేడు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె మండలం జగనన్న కాలనీకి చెందిన మేకల ప్రసాద్ భార్య సుజాత(37) అంగళ్లకు సమీపంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో పని చేస్తోంది. ఈ నెల 19న కళాశాలకు వెళ్లిన ఆమె ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా అంగళ్ల సమీపం లోని మల్లెలగడ్డ వద్దనున్న రామక్కచెరువులో ఆమె మృతదేహాన్ని స్థానికులు గుర్తించడంతో ముదివేడు పోలీసులు బుధవారం మృతదేహాన్ని వెలికితీసి మదనపల్లె ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన మల్లికార్జునరెడ్డి

రామసముద్రం, జనవరి 24: ద్విచక్ర వాహనాన్ని టెంపో ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని మినికి పంచాయతీ రాగిమాకుల పల్లెకు చెందిన మల్లికార్జునరెడ్డి ద్విచక్ర వాహనంపై పుంగనూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా రామసముద్రం నుంచి పుంగనూరుకు వెళ్తున్న కోళ్ల టెంపో కేసీపల్లె వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిని మల్లికార్జునను 108లో అతన్ని పుంగనూరు ఆస్పత్రికి తరలించారు.

నిమ్మనపల్లి ఇన్‌చార్జి ఎస్‌ఐగా తిప్పేస్వామి



నిమ్మనపల్లి, జనవరి 24: నిమ్మనపల్లి మండల ఇన్‌చార్జి ఎస్‌ఐగా తిప్పేస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కలకడ మండ లంలో విధులు నిర్వహిస్తున్న ఆయన నిమ్మనపల్లి ఇన్‌చార్జి ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించారు. గతం లో ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ సంబేపల్లికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా తిప్పేస్వామి మాటా ్లడుతూ రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని నాటుసారా, పేకాట, కోడిపందాలను అరికట్టనున్నట్లు ఆయన తెలిపారు.

కందూరు రూట్‌లో గిఫ్ట్‌స్కీం

మదనపల్లె అర్బన్, జనవరి 24: మదనపల్లె- కందూరు మార్గంలో గిఫ్ట్‌స్కీంను అందజేస్తున్నట్లు టూడిపో మేనేజరు నిరంజన్ తెలిపారు. ఈ మార్గంలో ప్రయాణించే వారు తమ టిక్కెటుపై పేరు, ఊరుపేరు, ఫోన్ నెంబర్‌ను రాసి, ఆర్టీసీ బస్సులలోని బాక్స్‌లో వేయాలని సూచించారు. జనవరి 31న లక్కీడిప్ నిర్వహించి, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రూరల్ మార్గంలోని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

పెంచలకోనకు మహా పాదయాత్ర

రైల్వేకోడూరు, జనవరి 24: మండలంలోని కె.బుడుగుంటపల్లె పంచాయితీలోని అయ్యవారిపల్లెకు చెందిన నరసింహస్వామి భక్తులు బుధవారం మహాపాదయాత్ర చేపట్టారు. సుమారు 450 మంది 41 రోజులు పాటు దీక్షలు చేపట్టి అనంతరం పాదయాత్రగా వెళ్లారు. రైల్వేకోడూరు నుంచి చిట్వేలి మీదుగా నెల్లూరు రాపూరుకు చేరుకుని అక్కడ నుంచి పెంచలకోన మహాక్షేత్రానికి చేరుకుంటారు.

కేంద్ర పథకాలు అందరికీ అందేలా చూడాలి

రాజంపేట, జనవరి 24: ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో ప్రవేశపెడుతున్న కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగోతు రమేశ్‌నాయుడు తెలిపారు. బుధవారం రాజంపేట మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో వికసిత్ భారత్ సంకల్పయాత్రకు ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ఇళ్లు, బీమా పథకాలు, కార్పొరేట్ వైద్యం, ఆయుష్మాన్ భారత్ వంటి అనేక కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు పరుస్తుందని, దీన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ జనార్దన్‌రెడ్డి, బీజేపీ కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేశ్‌నాయుడు, బీజేపీ నేత ఆదినారాయణ, నరేంద్రవర్మ, సునీతవర్మ, వేల్పుల రమణ పాల్గొన్నారు.

వైసీపీ దొంగఓట్లతో గెలవాలని చూస్తోంది..

● మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి

రామసముద్రం, జనవరి 24: రాబోయే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో టీడీపీ సానుభూతి పరుల ఓటర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడంతోపాటు, దొంగ ఓట్లతో వైసీపీ దొడ్డిదారిన ప్రయత్నాలు చేస్తోందని మదనపల్లె నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఇన్‌చార్జి దొమ్మలపాటి రమేష్ విమర్శించారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కురిజల గ్రామంలో ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజా వ్యతిరేకత పెరిగిందని, రాబోయే ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో సిట్టింగ్ ఎమ్మెల్యేలను మారుస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా టీడీపీ గెలుపును అపలేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, చిన్నస్వామి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మునివెంకటస్వామి, సుబ్బన్న, క్లస్టర్ ఇన్‌చార్జి సీతప్ప, మాజీ సర్పంచ్ బండెల శివప్ప, సలీం, మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలకు మంచి స్పందన

మదనపల్లె టౌన్: టీడీపీ అధినేత ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ తెలిపారు. బుధవారం మండలంలోని కొత్తవారిపల్లె పంచాయతీ దిగువ కాశీరావుపేటలో మండల టీడీపీ అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ..భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబు అమలు చేయనున్న ఆరు పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు, రైతులకు, విద్యార్థులకు, యువత సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ చంద్రబాబు అమలు చేయనున్న పథకాలు కచ్చితంగా అమలు చేస్తారన్నారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు భవానిప్రసాద్, యూనిట్ ఇన్‌చార్జి చల్లా నరసింహులు, మునిరాజ, రమణ, జయరామ్, సహదేవ పాల్గొన్నారు.


వేణుగోపాల్‌రెడ్డికి కండువా కప్పి స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్

టీడీపీలో చేరిన వైసీపీ నేత

మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ ఆధ్వర్యంలో మండలంలోని తట్టివారిపల్లెకు చెందిన వైసీపీ నాయకుడు తట్టి వేణుగోపాల్‌రెడ్డి టీడీపీ చేరారు. బుధవారం తట్టివారిపల్లెలో వేణుగోపాల్‌రెడ్డి నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయనకు టీడీపీ కండువా కప్పి దొమ్మలపాటి సాదరంగా ఆహ్వానించారు. వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు విసుపోయారన్నారు. తాను టీడీపీలో చేరేందుకు ఇంటి వద్ద షామియానా వేసుకుంటే, పక్కనే వున్న వైసీపీ నాయకుడు దౌర్జన్యంగా తొలగించాడని ఆరోపించారు. తమ పంచాయతీలో టీడీపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. వైసీపీ నేత, మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తట్టి శ్రీనివాసులురెడ్డి సోదరుడైన వేణుగోపాల్‌రెడ్డి టీడీపీలో చేరడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు భవానీప్రసాద్, వల్లిగట్ల వెంకటరమణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టమోటా మార్కెట్ వద్ద స్థానికేతర వాహనాల అడ్డగింత

● రూ.200 చొప్పున కార్పస్‌ఫండ్ వసూలు

మదనపల్లె టౌన్, జనవరి 24: మదనపల్లెలోని టమోటా మార్కెట్ యార్డు నుంచి బయటకు వచ్చే ఐషర్ మినీ లారీలను బుధవారం స్థానిక మినీ లారీ అసోసియేషన్ నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లెలో 250 మినీ లారీలు ఉన్నా, కొందరు మండీ యజమానులు బయటి రాష్ట్రాల నుంచి వచ్చే మినీ లారీలకు కిరాయిలు అప్పజెబుతున్నారన్నారు. దీంతో తమకు కిరాయిలు లేక అవస్థలు పడుతున్నామన్నారు. అనంతపురం, కర్నూల్, కోలారు ప్రాంతాల్లోని మార్కెట్లకు తాము వెళ్లినపుడు అక్కడి అసోసియేషన్ నాయకులు రూ.200 నుంచి రూ.300 వరకు కార్పస్‌ఫండ్ వసూలు చేస్తున్నారన్నారు. అందుకే తాము కూడా మదనపల్లె మార్కెట్ నుంచి టమోటాలు తీసుకెళ్లే మినీ లారీల నుంచి కార్పస్‌ఫండ్ వసూలు చేస్తున్నామన్నారు. ఈ నిధులను కూడా డ్రైవర్లు, క్లీనర్ల సంక్షేమానికి, అత్యవసర ఖర్చులకు వాడుతున్నామన్నారు. మార్కెట్ కమిటీ నిబంధనల మేరకే తాము వ్యవహరిస్తున్నామని, మార్కెట్ లోపల డబ్బు వసూలు చేయడం లేదన్నారు. కాగా, బయటి లారీల నుంచి డబ్బు వసూలు చేయెద్దని మంగళవారంమార్కెట్ కమిటీ చైర్మన్, సెక్రటరీలు చెప్పిన విషయం తెలిసిందే. అయినా, బుధవారం మినీ లారీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, సభ్యులు మార్కెట్ బయట కాపుకాచి మినిలారీల నుంచి డబ్బులు వసూలు చేశారు.


టమోటా మార్కెట్ బయటకు వచ్చిన మిని లారీ డ్రైవర్ నుంచి కార్పస్ ఫండ్ వసూలు చేస్తున్న మినీలారీ అసోసియేషన్ నాయకులు

కుక్కల బెడదతో ప్రజల్లో ఆందోళన

గుర్రంకొండ, జనవరి 24: గుర్రంకొండ పట్టణంలో వీధి, పిచ్చికుక్కల బెడద ఎక్కువైపోయింది. ఈ కుక్కల బెడదతో ప్రజలు, పిల్లలు వీధులోకి రావాలంటే భయపడుతున్నారు. ఈ కుక్కల గుంపులు దాడి చేసి గాయపరుస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో నెల రోజుల వ్యవధిలో సుమారు 20 మందికి పైగా కుక్క కాటుకు గురైనట్లు తెలుస్తుంది. ఈ కుక్కల గుంపులు బస్టాండులో ఉంటూ చికెన్ వ్యర్థాలు తినడం అలవాటు చేసుకున్నాయి. ఈ క్రమంలో వీధుల్లో తిరిగే సమయంలో రోడ్డుపై నడిచి వెళ్లే మహిళలు, పిల్లలు, వృద్ధులపై దాడి చేస్తున్నాయి. గత ఏడాది డిసెంబరు 7వ తేదీ బలిజగడ్డకు చెందిన పది మందిపై కుక్కల దాడి చేసి గాయపరిచాయి. అలాగే ఈ నెల 10వ తేదీన తాళంవీధికి చెందిన ఓ బాలుడిపై పిచ్చికుక్క దాడి చేసి తలపై తీవ్రంగా కరిచింది. దీంతో కుటుంబ సభ్యులు బాలుడ్ని తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఇలా గుర్రంకొండ వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను ముప్పు తిప్పలు పెడుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సివుంది.


పిచ్చి కుక్కల దాడిలో గాయపడిన బాలుడు (ఫైల్‌ఫొటో)

'ఆడుదాం ఆంధ్ర'తో క్రీడాకారులకు ప్రోత్సాహం

రాయచోటిటౌన్, జనవరి 24: ఆడుదాం ఆంధ్రాతో గ్రామీణ క్రీడాకారుల ప్రతిభకు ప్రోత్సాహం కలుగుతోందని ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. బుధవారం ఆయన రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో రాయచోటి నియోజకవర్గ స్థాయి ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆడుదాం- ఆంధ్రలో భాగంగా నియోజకవర్గ స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగానే కబడ్డీ విభాగంలో రాయచోటి వర్సెస్ చిన్నమండెం, ఖోఖో విభాగంలో రాయచోటి వర్సెస్ లక్కిరెడ్డిపల్లె, వాలీబాల్ విభాగంలో రాయచోటి వర్సెస్ సంబేపల్లె గర్ల్స్, రాయచోటి వర్సెస్ సంబేపల్లె బాయ్స్ పోటీలను ఎమ్మెల్యే, ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో జిల్లా ఆదర్శంగా నిలిచేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, ఆర్డీవో రంగస్వామి, డ్వామా పీడీ మద్దిలేటి, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఎంపీడీవో మల్‌రెడ్డి, తహసీల్దార్ ప్రేమంత్‌కుమార్, స్పోర్ట్స్ అధికారి చంద్రశేఖర్, ఆడుదాం ఆంధ్ర గేమ్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి నరసరాజు, కబడ్డీ కోచ్ షఫీ, డీఎస్‌డీఓ గౌసబాషా, ఫిజికల్ డైరెక్టర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.


నియోజకవర్గ స్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

కార్యదర్శులకు, వీఆర్వోలకు శిక్షణ

పుల్లంపేట, జనవరి 24: పేదలందరికీ ఇళ్లు అనే కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఇళ్లను సచివాలయాల్లో రిజిస్టరు చేసేందుకు సచివాలయంలో పనిచేసే పంచాయతీ కార్యదర్శులకు, వీఆర్వోలకు బుధవారం శిక్షణ ఇచ్చారు. స్థానిక సబ్ రిజిస్టారు కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ అజీజుల్లా ఆధ్వర్యంలో సీనియర్ అసిస్టెంట్ సుబ్బనరసయ్య ఈ శిక్షణ ఇచ్చారు.

రా.. కదలిరా సభను విజయవంతం చేయాలి


స్థానిక నాయకులతో చర్చిస్తున్న టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి

తంబళ్లపల్లె, జనవరి 23: పీలేరులో ఈ నెల 27న టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగే రా.. కదలిరా బహిరంగ సభను కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని తంబళ్లపల్లె టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని గుండ్లపల్లె, వేమారెడ్డిగారిపల్లెలో టీడీపీ, జనసేన నాయకులతో కలసి పర్యటించారు. పీలేరు మహాసభపై స్థానిక నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గమంతా సభకు వెళ్లడానికి ఉత్సాహంగా ఉన్నారన్నారు. వైసీపీ అరాచక పాలనలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రజలు గ్రహించి చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్న బలమైన సంకల్పంతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో బత్తిని జనార్దన్ రెడ్డి, అంజనేయ రెడ్డి, మంత్రి గిరిధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మస్తాన్ రెడ్డి, మాధవరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శివారెడ్డి, మనోహర్‌రెడ్డి, గంగిరెడ్డి, శివకుమార్, మధుకర్ నాయుడు, రెడ్డప్పనాయుడు, హరినాథ్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించండి


అప్పారావువీధిలో ప్రచారం చేస్తున్న జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు, దారం అనిత

మదనపల్లె, జనవరి 24: వచ్చే సాధారణ ఎన్నికల్లో జనసేనను గెలిపించాలని ఆ పార్టీ నియోజకవర్గ నేత శ్రీ రామ రామాంజనేయులు ప్రజలను కోరారు. జనం కోసం జనసేన కార్యక్రమంలో భాగంగా బుధవారం 46వ రోజు జనసేన-టీడీపీ శ్రేణులు అప్పారావు వీధి, కృష్ణ విద్యాలయంవీధి, దేవళం వీధుల్లో పర్యటించారు. జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించడం ద్వారా ఉమ్మడి ప్రజా ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాలని కోరారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనపై ప్రజలు అన్ని విధాలా విసిగిపోయారని, జగన్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే.. దాడులు, దౌర్జన్యాలు మరింత పెరగడంతోపాటు ప్రజల భూములు సెంటు కూడా మిగలవని హెచ్చరించారు. ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. మినీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటా అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, పట్టణ అధ్యక్షుడు నాయని జగదీష్, దారం హరిప్రసాద్, కోటకొండ చంద్రశేఖర్, రెడ్డిరాయల, ఆకుల శంకర్, ధరణి, సోను, సుప్రీంహర్ష, వినయ్‌కుమార్‌రెడ్డి, చంద్ర, గోపాల్, అనిల్, సాజిత్, జనసైనికులు, వీరమహిళలు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో దళారుల దందా అరికట్టాలి


ధర్నా చేస్తున్న బహుజన యువసేన నాయకులు

మదనపల్లె టౌన్, జనవరి 24: మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో పనిచేసే కొంతమంది వైద్యులు, నర్సులు దళారుల అవతారమెత్తి అక్కడికి వచ్చే రోగులను ప్రైవేటు ఆస్పత్రులకు పంపుతున్నారని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ కుమార్ ఆరోపించారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో బీవైఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ వైద్యులు దేవుడితో సమానమని, కాని కొందరు వైద్యులు లాభార్జనే ధ్యేయంగా ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులను భయపెట్టి ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో తప్పుడు రిపోర్టులు పెట్టి కిడ్నీ ఆపరేషన్ చేయాలంటూ డబ్బులు గుంజుతున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోకి వచ్చే శస్త్రచికిత్సలకు కూడా ప్రైవేటు ఆస్పత్రులు రోగుల వద్ద డబ్బులు గుంజుతున్నాయని, కనీసం రోగికి, వారి సహాయకులకు భోజనం కూడా పెట్టడం లేదన్నారు. వీటన్నింటిపై ఓ కమిటీని నియమించి ఆర్డీవో ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో విచారించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో మురళికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు సుధాకర్, నవీన్, ఆది, షరీఫ్, శశి, దేవేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

మదనపల్లె అర్బన్, జనవరి 24: డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని టూడిపో డీఎం నిరంజన్, వన్‌డిపో మేనేజరు వెంకటరమణారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వన్, టూ డిపో ఉద్యోగుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ డ్రైవర్లు నియమ నింబంధనలు పాటించి బస్సులు నడపాలని సూచించారు. ప్రమాదరహితంగా ప్రయాణికులను గమ్యం చేర్చే బాధ్యత వారిపై ఉందన్నారు. చైతన్య స్కూల్ విద్యార్థులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు డీఆర్ జగదీష్, పెరవలి శ్రీనివాసులు, మౌలాలి, చంద్రశేఖర్, గోవర్ధన్, బాబురెడ్డి, నాగరాజ తదితరులు స్వీట్స్‌తోపాటు రోజా పూలు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు రేవతి, గీతా, హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి, సురేంద్రనాథ్, చైతన్యస్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వక్కలిగలకు బీసీ 'బి' సర్టిఫికెట్ ఇవ్వాలి


ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న వక్కలిగల సంఘం సభ్యులు

మదనపల్లె అర్బన్, జనవరి 24: వక్కలిగలను (మొరుసు కాపులు) బీసీ బీ లుగా గుర్తిస్తూ 2019లో అప్పటి ప్రభుత్వం విడుదల చేసిన జీవో 33 ను అమలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆ సంఘం సభ్యులు ఆరోపించారు. బుధవారం స్థానిక సబ్ కలెకర్ కార్యాలయంలో ఆర్డీవో మురళికి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అక్కడే ఉన్న తహసీల్దార్ మహబూబ్ చాంద్‌కు కూడా సంఘం సభ్యులు విన్నవించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, సురేంద్రరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, రవీంద్రరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, ఆనందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ల సేవలు అభినందనీయం..


ఆర్టీసీ డ్రైవర్‌కు పుష్పం, స్వీట్లు ఇచ్చి అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి

వాల్మీకిపురం. జనవరి 24: ఆర్టీసీ డ్రైవర్ల సేవలు అభినందనీయమని వాల్మీకిపురం ఎన్‌టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఆర్టీసీ డ్రైవర్లకు పుష్పాలు, స్వీట్లు పంపిణీ చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పెద్దప్పరాజు, అధ్యాపకులు రేణుక, నజీముద్దీన్, ప్రవీణ్, సుబ్రహ్మణ్యం, షబీనా, ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం, జనవరి 24: పట్టణంలోని పట్టాభి రామా లయంలో గురువారం ఉదయం టీటీడీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు తెలిపారు. కల్యాణంలో పాల్గొనదలచిన దంపతులు, భక్తులు ముందస్తు రుసుము చెల్లించి పాల్గొనవచ్చునని, వేడుకల అనంతరం టీటీడీ వస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేయనున్నట్లు తెలిపారు.

సభను విజయవంతం చేయండి: మండిపల్లి

సంబేపల్లె, జనవరి 24: పీలేరులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించే రా కదలిరా సభకు కార్యకర్తలు, నాయకులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని నియోజక వర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. బుధవారం సంబేపల్లెలోని టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న స్థలంలో పీలేరు సభకు వచ్చే టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు టిఫెన్, భోజన వసతి కల్పించడం కోసం ఏర్పాటు చేసిన సభాస్థలిని ఆయన పరిశీలించారు. రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు, చక్రాయపేట, కడప, పులివెందుల వైపు నుంచి వచ్చే కార్యకర్తలకు, నాయకులకు భోజన వసతికి ఈ స్థలం ఎంతో అనువుగా ఉంటుందన్నారు. అనంతరం కాటిమాయకుంట మాజీ సర్పంచ్ కొండా భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో 'రా కదలిరా సభ' వాల్ పోస్టర్లను అభిమానులతో కలిసి రాంప్రసాద్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు నాగేశ్వర్‌నాయుడు, గోపాల్, వెంకట్రామిరెడ్డి, కొండా భాస్కర్‌రెడ్డి, యువనాయకులు అంచలరెడ్డి, ఈశ్వర్, రామాంజుల్‌రెడ్డి, టీడీపీ నాయకులు దుద్యాల విష్ణువర్దన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, పోలు రెడ్డెప్ప నాయుడు, పోలు సురేంద్రనాయుడు, సుబ్బరాజుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.